
# సూర్య ఆదివారం

1.12.2024




## ఆదరణ కొరవడి అంతరించిపోతున్న భాషలు



**నూకారపు సూర్యప్రకాశరావు**
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**ఇండియా, పాకిస్తాన్ మధ్య ఉన్న వైరం కారణంగా క్రికెట్ కి రాజకీయ సెగ తగిలింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పాకిస్తాన్ లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. కానీ టీమిండియా పాకిస్తాన్ వెళ్లి ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు. రెండు దేశాల మధ్య నెలకొన్న రాజకీయ పరిస్థితులు, సెక్యూరిటీ కారణాల వల్ల ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు. మీరేమంటారు?**
**పట్నన రాజశేఖర్, సింగపూర్**

అవును రాజశేఖర్‌గారు 2008 తర్వాత టీమిండియా పాకిస్తాన్ టూర్ కి వెళ్ళలేదు. పాకిస్తాన్ మాత్రం 2013లో ఇండియా వచ్చి ఒక సిరీస్ లో పాల్గొంది. టీమిండియా పాకిస్తాన్ లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉండేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) పార్టీ నేత తేజస్వి యాదవ్ తీవ్రంగా తప్పు పట్టారు. తేజస్వి యాదవ్ కామెంట్స్ తో బీసీసీఐకి, టీమిండియాకి పొలిటికల్ సెగ మొదలైందనే చెప్పాలి. . మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన తప్పుపట్టారు. 2015లో నరేంద్ర మోదీ పాకిస్తాన్ లో పర్యటించారు. పాకిస్తాన్ ప్రధానితో కలసి బిర్యానీ తిన్నారు. మోదీ పర్యటనకి లేని అభ్యంతరం.. టీమిండియా పాకిస్తాన్ వెళ్లడానికి ఎందుకు వచ్చింది ? క్రీడల్లో రాజకీయాల జోక్యం మంచిది కాదు. అంటే ఒలంపిక్స్ లో కూడా ఒక దేశానికీ ఇతర దేశాలు వెళ్లకుండా ఆంక్షలు విధిస్తారా ? పాకిస్తాన్ కి మోదీ వెళ్లడం మంచి విషయం అయినప్పుడు.. టీమిండియా వెళ్లడం కూడా మంచి విషయమే కదా అని యాదవ్ అన్నారు.

ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా పాల్గొనడం పై బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్ల ఆర్లెడీ స్పందించారు. బీసీసీఐ తప్పకుండా ప్రభుత్వ నిర్ణయాలకు లోబడి పనిచేస్తుంది అని రాజీవ్ శుక్ల అన్నారు. మరో రెండు నెలల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కాబోతోంది. కానీ ఇంతవరకు ఐసీసీ షెడ్యూల్ పూర్తి చేయలేదు. దానికి కారణం టీమిండియా, బీసీసీఐ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడమే అని అంటున్నారు. ఒక వేళ పాకిస్తాన్ తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకి మరో దేశం ఆతిథ్యం పంచుకుంటే అప్పుడు టీమిండియాకి భారత ప్రభుత్వం నుంచి అనుమతి వస్తుందా అనే చర్చ కూడా జరుగుతోంది. మొత్తంగా తేజస్వి యాదవ్ లేటెస్ట్ కామెంట్స్ క్రీడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

టీమిండియా, పాకిస్తాన్ ఎప్పుడు క్రికెట్ ఆడినా ఫ్యాన్స్ కి వచ్చే మజా వేరు. పాకిస్తాన్, ఇండియా కలసి ఐసీసీ టోర్నీలలో తప్ప ఇతర సిరీస్ లలో పాల్గొనడం లేదు. దీనితో ఇండియా, పాక్ మ్యాచ్ లకు విపరీతమైన క్రేజ్ ఉంది.

## ఛైర్మన్‌తో ముఖాముఖి

**డిగ్రీ కోర్సుల వ్యవధిని తగ్గించుకునే, పొడిగించుకునే ఆప్షన్ను పొందుతారని యూజీసీ చెప్పింది. ఇది విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందా? మీరు చెప్పండి.**
**సృజనా దేవి మావురాళ్ళ, కోరుట్ల**

**అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల డిగ్రీ కోర్సులపై యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. యూజీ విద్యార్థులు త్వరలో**

కచ్చితంగా సృజన గారూ మారు మూల గ్రామాలలో ఉన్నా ఎంతో తెలివి తేటలున్నా ఏళ్లతరబడి విద్యాభ్యాసాలు చేస్తున్న వారికి ఉపయుక్తం, యూజీ విద్యార్థులకు తమ డిగ్రీ ప్రోగ్రామ్ల వ్యవధిని వారి అభ్యాస సామర్థ్యం ఆధారంగా తగ్గించడం లేదా పొడిగించే విధంగా ఉన్నత విద్యా సంస్థలు త్వరలో ఒక ఆప్షన్ను తీసుకురానున్నట్లుగా పేర్కొంది కదా? "విద్యార్థులు వారి అభ్యాస సామర్థ్యాల ఆధారంగా వారి డిగ్రీ కోర్సు వ్యవధిని తగ్గించడం, పొడిగించుకునే ఆప్షన్ను ఎంచుకోవచ్చు. యాక్సిలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏడీపీ) ద్వారా ప్రతి సెమిస్టర్లో అదనపు క్రెడిట్లు సంపాదించడం ద్వారా తక్కువ సమయంలో మూడు లేదా నాలుగేళ్ల డిగ్రీ కోర్సును పూర్తి చేయవచ్చు. అయితే ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఈడీపీ)తో డిగ్రీ కాలవ్యవధిని పెంచుకోవచ్చు. ప్రతి సెమిస్టర్లో తక్కువ క్రెడిట్స్ వచ్చినవారికి ఈ ఆప్షన్ను ఎంచుకోవచ్చు. ఏడీపీ, ఈడీపీ ప్రోగ్రామ్లకు విద్యార్థుల అర్హతను అంచనా వేయడానికి ఉన్నత విద్యాసంస్థలు కమిటీలను ఏర్పాటు చేస్తాయి. ఈ డిగ్రీలతో అన్ని ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు. సాధారణ డిగ్రీల్లానే వీటికి విలువ ఉంటుంది." అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు మొదటి లేదా రెండో సెమిస్టర్ చివరలో ఏడీపీని ఎంచుకునే అవకాశం ఉంటుందని యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్ తెలిపారు. ఆ తర్వాత ఏడీపీ ప్రోగ్రామ్ను ఎంచుకోలేరని "ఏడీపీని ఎంచుకునే విద్యార్థులు ప్రతి సెమిస్టర్లో అదనపు క్రెడిట్‌లను పొందాలి. విద్యార్థులు మొదటి సెమిస్టర్ తర్వాత ఏడీపీలో చేరినట్లయితే, రెండో సెమిస్టర్ నుంచి అదనపు క్రెడిట్లు సాధించాలి. రెండో సెమిస్టర్ తర్వాత ఏడీపీలో చేరినట్లయితే, మూడో సెమిస్టర్ నుంచి అదనపు క్రెడిట్లు సాధించాల్సి ఉంటుంది. 3 లేదా 4 ఏళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్లో కోర్సును గరిష్ఠంగా రెండు సెమిస్టర్ల వరకు పొడిగించుకోవచ్చు." అని పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థలు ఎంచుకున్న వ్యవధిలో డిగ్రీ ప్రోగ్రామ్ పూర్తి చేసిన స్టూడెంట్స్కు డిగ్రీలు అందించవచ్చని యూజీసీ చీఫ్ తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్ కోసం కోర్సు పూర్తి కాలం వేచి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అయితే వేగవంతమైన, పొడిగించిన డిగ్రీల కోసం విద్యార్థి స్వీయ నియంత్రిత నోటు రాయాల్సి ఉంటుందని వెల్లడించారు.

## లెజెండ్

# గీతాంజలి



(గత **వారం తరువాయి**)

అదేవిధంగా సీరియల్స్ తీసేవారు కూడా అడగడంతో నటించేందుకు అంగీకరించాను.

**నచ్చిన చిత్రం, నచ్చిన హీరో**

షావుకారు జానకి గారు బాలచందర్ దర్శకత్వంలో 'ఎదురు నిశ్చల్' అనే తమిళ చిత్రం నిర్మించారు. అది తమిళంలో బాగా హిట్ కావడంతో తెలుగులో 'సంబరాల రాంబాబు' అనే చిత్రం కూడా నిర్మించారు. ఈ చిత్రంలో చలం గారితో నేను నటించాను. ఇందులో నాదొక బ్రాహ్మణ యువతి పాత్ర. ఈ చిత్రంతో పాటు, ఇందులోని పాటలు కూడా హిట్ కావడంతో ప్రేక్షకులందరి దృష్టిలో 'గీతాంజలి' హాస్యనటిగా నిలిచిపోయింది. అందుకే ఈ చిత్రం నాకు బాగా నచ్చింది. కాగా వెండితెరపై కథానాయిక లలో నాకు నచ్చిన నటి శ్రీదేవి.

**మరువలేని సంఘటన**

నా సినీ జీవితంలో మరువలేని సంఘటన నా పేరు మార్పే. బాబూభాయ్ మిస్త్రీ గారు గీతాంజలి అని నామకరణం చేసి ఆర్టిస్టుగా నాకు జీవం పోశారు. ఇలా ప్రేక్షకుల హృదయాల్లో గీతాంజలి పేరుతో చిరస్థానం సంపాదించుకోవడం మరువలేనిది.

సినీ జీవితంలో ఒడిదుడుకులు సహజం. వాటిని ఎదుర్కొనే నటించాను. ముఖ్యంగా ఈ విషయంలో నా తండ్రిగారు నన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. భగవంతుడి ఆశీ స్సులు, తల్లిదండ్రుల ఆశీస్సులు కూడా నాకు ఎంతగానో తోడ్పడ్డాయి.

ఎవరి మైండ్‌సెట్ వారికుండాలి

నా నట జీవితంలో నేను ఎంతో సంతోషంతో, సంతృప్తితో ఉన్నాను. మంచి చిత్రాల్లో, విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల ఆదరణ పొందాను. ఈ తరం నటీమణులు కూడా వారి స్థాయిలో వారు మైండ్ సెట్ నిర్మించుకుని ప్రేక్షకుల అభిమానం సంపాదించి వారి హృదయాల్లో చిరస్థానం పొందేందుకు కృషి చేయాలనేది నా ఆకాంక్ష.

**ప్రస్తుత హాస్యం**

హాస్యం విషయంలో, ఆనాటి సినిమాల్లో రేలంగి, పద్మనాభం, నగేష్, రాజబాబు వంటి హాస్య నటుల్ని నేను ఎక్కువగా లైక్ చేసేదాన్ని. ఇప్పుడు ముఖ్యంగా హాస్యాన్ని అందించే నటులందరూ హాస్య నటులే. బ్రహ్మానందం, వేణు, అలీ వంటివాళ్ళంతా చక్కటి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందిస్తున్నారు.

**నేటి చిత్రాలు నేచురాలిటీకి భిన్నం**

ఆనాటి చిత్రాలకు, ఈనాటి చిత్రాలకు తేడా ఏమిటి అంటే ఏమని చెబుతాం? ఆనాటి గుమ్మడి, ఎస్వీ రంగారావు, రామారావు, నాగేశ్వరరావులు ఈనాడు ఉన్నారా? **ఈనాటి చిత్రాలు** నేచురాలిటీకి భిన్నంగా ఉంటున్నాయి. ఆనాటి రేలంగి, రమణారెడ్డి, పద్మనాభం, రాజబాబు, నగేష్‌ల హాస్యం చూస్తే ఇప్పటికీ గుర్తుంటుంది. ఈనాటి హాస్యం గురించి ప్రేక్షకులే తీర్పు చెబుతారు. ఏదిఏమైనా ఆనాటి పరిస్థితులను, ఈనాటి పరిస్థితులను కంపేర్ చేయడం మాత్రం కుదరదు. కాల పరిస్థితుల్ని బట్టి మార్పులు వస్తున్నాయి.

**కుటుంబం**

1974 ఆగస్టు 15వ తేదీన నటుడు రామకృష్ణగారితో నా వివాహం జరిగింది. మా నాన్నగారు రామకృష్ణగారిలోని గుణగణాలన్నింటినీ చూసి ముచ్చటపడి మా ఇద్దరికీ వివాహం చేశారు. అబ్బాయి మంచి అందగాడు, వెరీ డీసెంట్ బిహేవియర్ అని రామకృష్ణగారి గురించి నాన్నగారు నాకు చెప్పి పెళ్ళికి ఒప్పించారు. అయితే ప్రేక్షకులు మాది ప్రేమ వివాహం అనుకున్నారు. కానీ అలాంటిదేం కాదు. మాది ఎరేంజ్‌డ్ మ్యారేజ్. రామకృష్ణగారివన్నీ విజయవంతమైన చిత్రాలే. వాటిల్లో రణభేరి, పూజ, నోము, యశోదకృష్ణ, నా పేరే భగవాన్...ఇలా ఎన్నో ఉన్నాయి. అయితే, మంచిరోజు, పెళ్ళిరోజు, తోటలోపిల్లా కోటలోరాణి, రాజయోగం, రణభేరి చిత్రాల్లో నేనూ, రామకృష్ణగారు కలిసి నటించాం.


వారు దివంగతులు కావడం నా దురదృష్టం. మా అబ్బాయి పేరు శ్రీనివాస్. నా మనవడి పేరు శాయి సజాయ్, మనవరాలు శయోన్. (మురుగన్ పేరు. అంటే సుబ్రహ్మణ్యస్వామి పేరన్నమాట)

**టి గీతాంజలి కన్ను మూత (1947 31-10-2019)**

అద్భుతమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన సీనియర్ నటి గీతాంజలి (72) ఇకలేరు. గురువారం తెల్లవారు జామున గుండెపోటు తో మృతిచెందారు

## నవ కవిత్వం

### " సూర్య" కాంతి...



ప్రతి ' అక్షరం ' పై
ప్రసరించటం
ప్రశంసనీయం.
సాహిత్యాభివృద్ధికిజి
సహకరించటం
శుభ పరిణామం.

సచిత్ర దిన పత్రికగా
సాగిపోవటం
సర్వామోదం.
అంటరానితనానికి
అవకాశం లేదనటం
అభినందనీయం.
పక్షపాత వైఖరి లేని
పత్రికను ప్రచురించటం
పాఠకులకు గౌరవం.
దీర్ఘాయుష్మాన్భవ అని
దీవించటం అభిమానుల కర్తవ్యం.
అందుకే..
" అక్షరాంజలితో "
ఆహ్వానించటం
అందరి అభిమతం.


**ఎ.సి.నాథ్.**
**9290434551.**

## లేఖలు

**ముఖచిత్ర కథనం**

కళల కనాచి మన తెలంగాణ పేరుతో తెలంగాణ వైభవాన్ని అనేక అంశాల పై ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కథనం బాగుంది. రచయిత కు ధన్యవాదాలు. ౨ప్రత్యేక కథనాన్ని ఆదివారం అనుబంధంలో ప్రచురించడం బాగుంది. అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నాము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**




**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.


**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## రాజ్యాంగం మనకేమిచ్చింది





రాజ్యాంగం మనకేమిచ్చింది
వయోజనులకు ఓటుహక్కునిచ్చింది
ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన
ప్రాతినిధ్య ప్రభుత్వాన్నిచ్చింది
ప్రభుత్వాలు తప్పు చేస్తే దండించే
స్వతంత్ర న్యాయ వ్యవస్థ నిచ్చింది
న్యాయ వ్యవస్థ కూడా
రాజ్యాంగానికి లోబడే తీర్పు నివ్వాలనే
రాజ్యాంగ ఆధిక్యాన్నిచ్చింది
రాజ్యాంగం మనకేమిచ్చింది
భిన్నత్వంలో ఏకత్వం గల మన దేశంలో
భారతజాతిని ఏకం చేసే
ఏక పౌరసత్వాన్నిచ్చింది
సాధారణ పరిస్థితుల్లో పాలించడానికి
సమైక్య ప్రభుత్వాలనిచ్చింది
అసాధారణ పరిస్థితుల్లో పాలించడానికి
బలమైన ఏకకేంద్ర ప్రభుత్వాన్నిచ్చింది
రాజ్యాంగం మనకేమిచ్చింది
పౌరులకి ప్రాథమిక హక్కులనిచ్చింది
వాటి అమలును ప్రభుత్వాలకిచ్చింది
ప్రభుత్వాలు హక్కులని కాలరాస్తే
వాటి సంరక్షణను
ఉన్నత న్యాయస్థానాలకిచ్చింది
మనకి ఇన్ని ఇచ్చిన మన రాజ్యాంగం
ఎన్నో ఒడిదుడుకులని తట్టుకొని
ఎన్నో అటుపోటులకి ఎదురు నిలిచి
దేశ కాలమాన పరిస్థితులకు
అనుగుణంగా
వందకు పైగా సవరణలతో
నేటికీ సజీవ సాక్ష్యంగా నిలిచింది
మన రాజ్యాంగం
అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ%ౖ
%విఫలం చెందలేదు
దాన్ని అమలు పరచడంలో
మనమే విఫలం చేస్తున్నాం.

**– కోనేటి నరేష్,**
**8499847863**









సూర్య బుడత

బాలల కథ


# స్నేహ ధర్మం!




మీన మంగళం అడవి మధ్యలో పెద్ద కొలను కలదు దాని ఒడ్డున ఉన్న చెట్టు మీద రామచిలుక దాని పిల్లలు ఉండేవి. చెట్టు మీద ఉన్న చిలుకలకు కొలనులో ఉన్న చేపలతో మంచి స్నేహబంధం ఏర్పడింది. చేపలు నీటి పైకి వచ్చి కబుర్లు చెబుతూ ఉండేవి. చేపలు నీటి పైన ఉన్నప్పుడు ఎవరైనా వేటగాడు అటువైపు రావడాన్ని గమనించినప్పుడల్లా పైనున్న రామచిలుకను, పిల్లలను అప్రమత్తం చేస్తూ ఉండేవి అప్పుడు రామచిలుకలు వేటగాడికి చిక్కకుండా లోపల దాక్కుంటూ ఉండేవి!

కొన్ని రోజులు బాగానే గడిచాయి ఒకరోజు చేపలు పట్టేవాడు దూరంగా కొలను దగ్గరికి రావడాన్ని గమనించిన చిలుక "ఎప్పుడూ లేనిది చేపలు పట్టేవాడు ఇటు వైపు వస్తున్నాడు ఏంటి?" అనుకొని వెంటనే తన పిల్లలను అప్రమత్తం చేసి "పిల్లలు మనం వెంటనే ఎగురుకుంటూ వెళ్లి ఆ వస్తున్న జాలరిని తరిమేయాలి" అనగా "ఎందుకమ్మా మనం వెళ్లడం అతను వచ్చేది మనకోసం కాదు కదా? మనమెందుకు వెళ్లడం?" అన్నాయి. "ఓసి పిచ్చి మొహాల్లారా జాలరి మన మిత్రులైనటువంటి చేపలను పట్టుకొనుటకు వస్తున్నాడు కనుక వారిని మనం రక్షించాలి" అనగా "ఎందుకమ్మా మనం రక్షించడం వాటి రక్షణ అవి చూసుకోలేవా? అతను ఏదో పొట్ట కూటి కోసం వస్తున్నాడు" అనగా "నోరు మూయండి మీకు తెలియదు వేటగాడు మనం ఉన్న చెట్టు దగ్గరికి వచ్చినప్పుడల్లా అతన్ని చూసిన చేపలు నీటి పైకి వచ్చి అలజడి చేసి మనల్ని జాగ్రత్త పరచడం వల్లే మనం వేటగాడికి చిక్కకుండా దాక్కోగలిగాం బతికి బయటపడ్డాం ఇప్పుడు ఆ చేపలు ఆపదలో ఉంటే రక్షించాల్సిన బాధ్యత మనది కాదా? అయినా మీరన్నట్టు ఆ వచ్చే జాలరి పొట్టకూటి కోసమే అనుకున్న ఈ చేపల్ని కాకుండా మిగతా వాటిని తిని కూడా అతను బతకగలడు ఈ చేపలే అతని ఆహారం కాదు! ఎప్పుడూ కూడా మనం మిత్రులకే కాదు చేతనైన సహాయం అందరికీ చేయడం నేర్చుకోవాలి" అనగా " మమ్మల్ని క్షమించమ్మా!" అని పిల్లలన్నీ ఎగురుకుంటూ జాలరి వద్దకు వెళ్లి అతని తలమీద, అతను భుజం మీద వేసుకున్న వలను ముక్కుతో పొడవడంతో ఈ హఠాత్పరిణామానికి భయపడిన జాలరి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న చేపలు హమ్మయ్య ముప్పు తప్పింది అని హాయిగా ఊపిరి పీల్చుకున్నాయి.

**– ఏడుకొండలు కళ్ళేపల్లి,**
**9490932338**








| | | | | | |
|---|---|---|---|---|---|
| 5 | | | | | 1 |
| 2 | | | 3 | 4 | |
| 6 | 5 | | | | 2 |
| 4 | | | | 1 | 6 |
| | 6 | 4 | | | 3 |
| 3 | | | | | 4 |

## వేమన శతకం

తప్పులెన్నువారు తండోపతండంబు
ఉర్వి జనులకెల్ల నుండు తప్పు
తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యము:
ప్రపంచంలో ప్రతిఒక్కరు తప్పులు చేస్తారు. చిన్న పిల్లల నుంచి పెద్ద పిల్లలవరకు చిన్న తప్పయినా చేస్తారు. అందులో చాలామంది ఇతరుల తప్పులను పట్టేవారు ముందుకు వస్తారు. కానీ లోకంలో వున్న ప్రజలందరు సులభంగా చేసే తప్పులను మాత్రం తమకుతాము గ్రహించలేరు.

### తక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ గాలి నాణ్యత కారణంగా

# పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు



డాక్టర్ సౌజన్య మంత్రిప్రగడ, అపోలో క్లినిక్,
ఫ్యామిలీ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్

హైదరాబాద్: చలికాలం ప్రారంభమై నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు గుర్తించారు. పౌరులలో ఆరోగ్య సమస్యలు పెరగడానికి వైద్యులు పేలవమైన గాలి నాణ్యత, తక్కువ ఉష్ణోగ్రత ప్రధాన కారణమని పేర్కొన్నారు.

నిజాంపేట్‌లోని అపోలో క్లినిక్ ఫ్యామిలీ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ సౌజన్య మంత్రిప్రగడ మాట్లాడుతూ రోగులలో శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు పెరగడాన్ని గమనించినట్లు తెలిపారు. "గత కొన్ని వారాల్లో, కేసుల సంఖ్య గణ నీయంగా పెరిగింది. 40-50% మంది రోగులు శ్వాసకోశ లక్షణాలతో మా దగ్గరికి వస్తున్నారు. ఎగువ, దిగువ రెసిపరేటరీ ట్రాక్ట్ అంటువ్యాధులు, బ్రోన్చియల్ ఆస్తమా, సీఓపీడీ లక్షణాలు గమనించబడ్డాయి. శ్వాసకోశ వ్యాధి కారక క్రిముల వ్యాప్తి వలన ఎక్కువ మంది వ్యక్తులు ఆసుపత్రిలో చేరాల్సివచ్చే జబ్బుల బారిన పడుతున్నారు."

జలుబు, దగ్గు, జ్వరం, ఊపిరి ఆడకపోవడం వంటివి రోగులలో సర్వసాధా రణమైన ఫిర్యాదులలో ఉన్నాయని డాక్టర్ మంత్రిప్రగడ తెలిపారు. "16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న రోగులు, వృద్ధులు ముఖ్యంగా మధుమేహం, దీర్ఘకాలిక వ్యాధుల వంటి సహవ్యాధులతో ఉన్నవారు ఈ సమస్యల గురించి ఫిర్యాదు చేస్తున్నా రు. అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్న వ్యక్తులలో గర్భిణులు, 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో ఉన్న వ్యక్తులు ఉన్నారు. రోగుల తాకిడికి ఎక్కువగా గురి కావడం వల్ల ఆరోగ్య సంరక్షణ సిబ్బంది కూడా ప్రమాదంలో ఉన్నారు" అని అన్నారు.

ముఖ్యంగా పిల్లలు, యువకులలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ కాలానుగుణ పెరుగుదలను కూడా డాక్టర్ మంత్రిప్రగడ గుర్తించారు. మైకోప్లాస్మా వంటి వైవిధ్య బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నాయని కూడా ఆమె పేర్కొన్నారు. ఇన్ఫ్లుయెంజా వైరస్‌ల వల్ల వచ్చే సీజనల్ ఇన్ఫ్లుయెంజా కూడా నగరం అంతటా విస్తరిస్తోంది.

పెరుగుతున్న కాలుష్యంతో పాటుగా కాలానుగుణంగా వచ్చే శీతల వాతావరణ పరిస్థితులు శ్వాసకోశ ఫిర్యాదులు పెరగడానికి ప్రధాన కారణాలని డాక్టర్ మంత్రిప్రగడ పేర్కొన్నారు. "మారుతున్న శీతోష్ణస్థితి హానికరమైన నేల స్థాయి ఓజోన్‌ను అధ్వాన్నంగా మార్చడం ద్వారా గాలి నాణ్యతపై ప్రభావం చూపు తుంది. గాలి నాణ్యత మరింత దిగజారడానికి దోహదం చేసే పుప్పొడి వంటి అలెర్జీ కారకాలకు ప్రజలు లోనుకావడం పెరుగుతుంది. శీతోష్ణస్థితి మార్పులు ఇళ్లు, కార్యాలయాలు లాంటి చోట్ల లోపలి గాలి నాణ్యతను కూడా ప్రభావితం చేస్తాయి. తేమతో కూ డిన వాతావరణం క్రిముల పెరుగుదల, దుమ్ము పురుగులు, బాక్టీరియాకు దారితీస్తుంది" అని డాక్టర్ మంత్రిప్రగడ చెప్పారు.

ఈ శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వ్యక్తుల మధ్య చాలా సులభంగా వ్యాపిస్తాయని ఆమె చెప్పారు. కొన్నిసార్లు, ఈ శ్వాసకోశ అంటువ్యాధులు ముఖ్యంగా సహవ్యాధులు, తక్కువ రోగనిరోధక శక్తి ఉన్న రోగులలో చాలా తీవ్రంగా ఉంటాయి. సమయానికి చికిత్స చేయకపోతే మరణానికి కూడా దారితీయవచ్చు.

ఈ తీవ్రమైన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఆరోగ్యంపై శీతోష్ణస్థితి, గాలి నాణ్యత ప్రభావాలను తగ్గించడానికి డాక్టర్ మంత్రిప్రగడ ఈ క్రింది నివారణ చర్యలను తెలిపారు:

1. సౌర, పవన మరియు జలవిద్యుత్ వంటి శక్తి వనరుల ద్వారా గ్రీన్ పవర్‌కి మారడం వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.
2. వాహనాల నుండి వచ్చే వాయు కాలుష్యం ఓ ప్రధాన కారకం మరియు ప్రజా రవాణా, బైకింగ్ మొదలైన వాటి ద్వారా వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రయత్నించవచ్చు.
3. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మొక్కలను నాటడం వల్ల గాలి నాణ్యత మెరుగుపడుతుంది.
4. మంటతో కూడిన కార్యకలాపాలను తగ్గించండి.

ఈ కారకాలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి, డాక్టర్ ఈ క్రింది చిట్కాలను తెలిపారు.

1. చేతులు కడుక్కోవడం, రద్దీగా ఉండే ప్రదేశాలలో మంచి వెంటిలేషన్ ఉండేలా చూసుకోవడం, రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్క్ ధరించడం, అనారోగ్యంగా ఉన్నప్పుడు ఇంట్లోనే ఉండడం, టీకాలు వేయించు కోవడం వంటి సాధారణ నివారణ చర్యలు వైరస్‌ల వ్యాప్తిని అరికట్టడంలో ప్రభావవంతంగా ఉంటాయి.
2. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు, కొన్ని ప్రమాద కారకాలు ఉన్న 5-18 సంవత్సరాల పిల్లలకు న్యుమోకాకల్ టీకా సిఫార్సు చేయబడింది. కొన్ని ప్రమాద కారకాలు ఉన్న 50 ఏళ్లు ఏళ్లు పైబడిన మరియు 19-49 వయస్సులోని పెద్దలందరూ కూడా ఈ టీకా తీసుకోవాలని సిఫార్సు చేయబడింది.
3. సీజనల్ ఇన్ఫ్లుయెంజా టీకా ప్రతి సంవత్సరం సిఫార్సు చేయబడింది, ఎందుకంటే టీకా నుండి రోగ నిరోధక శక్తి కాలక్రమేణా పోతుంది. వ్యాక్సిన్‌లు వ్యాప్తిలో ఉన్న వైరస్‌లను నిరోధించేందుకు ఆయా వైరస్ లకు సరిపోయే కొత్త వ్యాక్సిన్‌లతో నిత్యం నవీకరించబడతాయి.
4. గర్భిణులకు వార్షిక ఇన్ఫ్లుయెంజా టీకాలు సిఫార్సు చేయబడ్డాయి.
5. ఆరు నెలల నుండి 5 సంవత్సరాల మధ్య పిల్లలు, 50 ఏళ్లు పైబడిన వారందరూ అలాగే మధుమేహం, సీఓపీడీ, రెనల్, కార్డియోవాస్కులర్, హెపాటిక్ న్యూరోలాజిక్, హెమటోలాజిక్ వంటి దీర్ఘకాలిక వైద్య పరిస్థితులు ఉన్న పిల్లలు, పెద్దలకు టీకాలు వేయాలని సిఫార్సు చేయబడింది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న రోగులు, ఊబకాయం (BMI> 40 ఏళ్లు) ఉన్న వ్యక్తులు, ఆరోగ్య కార్యకర్తలు కూడా టీకాలు వేయించుకోవాలి.

# ముఖానికి బెల్లం రాస్తే చాలు, వయసు తగ్గడం ఖాయం..!



మనమందరం రెగ్యులర్ గా ఇంట్లో బెల్లం వాడుతూనే ఉంటాం. ఏదైనా స్వీట్ చేయాలంటే బెల్లం ఉండాల్సిందే. పంచదారకు ప్రత్యామ్నాయంగా ఈ బెల్లాన్ని వాడుతూ ఉంటాం. కానీ.. ఈ బెల్లం మన ఆరోగ్యాన్ని మాత్రమే కాదు.. అందాన్ని కూడా పెంచుతుందని మీకు తెలుసా? మీరు నమ్మకపో యినా ఇదే నిజం. మనం యవ్వనంగా కనిపించాలని, అందాన్ని పెంచుకో వాలని ఏవేవో వాడేస్తూ ఉంటాం. కానీ, వాటన్నింటినీ పక్కన పెట్టి.. ముఖానికి బెల్లం రాస్తే చాలు. మీరు యవ్వనంగా మారడంతోపాటు, అందాన్ని కూడా పెంచుకోగలరు. మరి, దానిని ఎలా రాయాలో ఇప్పుడు చూద్దాం..

%బెల్లాన్ని చెరకు నుంచి తయారు చేస్తారు. ఈ బెల్లంలో విటమిన్లు ఏ, సి, బి కాంప్లెక్స్, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం వంటి ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. అందుకే.. బెల్లం తినడం కాదు, డైరెక్ట్ గా ముఖానికి రాస్తే చలికాలంలో అందం పెంచడానికి సహాయం చేస్తుంది. చల్లని నెలల్లో, మీ చర్మం త్వరగా తేమను కోల్పోతుంది, పొడిగా, నిస్తేజంగా, చికాకుకు గురవుతుంది. అందుకే.. ఈ చలికాలంలో బెల్లం ముఖానికి రాయడం వల్ల చర్మం మాయి-ంశ్చరైజింగ్ గా మారుతుంది. పొడి చర్మం సమస్య ఉండ దు. ముఖం పగలడం లాంటి సమస్య ఉండదు. అంతేకాకుండా.. యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు కనిపించవు. బెల్లం రక్త ప్రసరణ, చర్మ కణాల సహజ పునరుత్పత్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. చలికాలం అంతా చర్మాన్ని ఆరోగ్యంగా మెరుస్తూ ఉంటుంది. ఇంట్లో తయారుచేసిన మాస్క్‌లు, స్క్రబ్‌లు లేదా మీ ఆహారంలో భాగంగా, బెల్లం శీతాకాలంలో మృదువైన, హైడ్రేటెడ్, ప్రకాశవంతమైన చర్మాన్ని నిర్వహించడానికి ఒక గొప్ప సహజ నివారణ. మరి, బెల్లం ముఖానికి ఎలా అప్లై చేయాలో చూద్దాం

**బెల్లం, తేనె ముఖానికి మాస్క్ :** 1 చెంచా బెల్లం, 1 చెంచా తేనె, **ఎలా ఉపయోగించాలి?**

బెల్లం కొద్దిగా కరిగించి అందులో తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసి 15-20 నిమిషాలు అలాగే ఉంచండి. గోరువెచ్చని నీటితో కడగాలి. ఈ మాస్క్ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడానికి, సహజమైన మెరుపును ఇస్తుంది.

**బెల్లం, చక్కెర కొబ్బరి నూనె స్క్రబ్ :** 1 టీస్పూన్ బెల్లం, 1 టీస్పూన్ చక్కెర, 1 టేబుల్ స్పూన్ కొబ్బరి నూనె **ఎలా ఉపయోగించాలి?**

అన్ని పదార్థాలను కలపండి. స్క్రబ్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖం ,శరీరంపై వృత్తాకార కదలికలలో 3-5 నిమిషాలు సున్నితంగా మసాజ్ చేయండి. గోరువెచ్చని నీటితో కడగాలి. ఈ స్క్రబ్ వల్ల చర్మంలోని మృతకణా లు తొలగిపోయి స్మూత్, గ్లోయింగ్ స్కిన్ పొందడానికి సహాయపడుతుంది.

**బెల్లం, పసుపు ఫేస్ ప్యాక్ :** 1 టీస్పూన్ బెల్లం, 1/2 స్పూన్ పసుపు పొడి, 1 టేబుల్ స్పూన్ పాలు లేదా పెరుగు **ఎలా ఉపయోగించాలి?**

మెత్తగా పేస్ట్ చేయడానికి పాలు లేదా పెరుగులో బెల్లం మరియు పసుపు కలపండి. దీన్ని మీ ముఖంపై అప్లై చేసి 15-20 నిమిషాలు అలాగే ఉ ండ నివ్వండి. ఈ ప్యాక్ చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చడంలో సహాయపడు తుం ది, మచ్చలను తగ్గిస్తుంది. యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది.

**బెల్లం, నిమ్మకాయ ఫేస్ మాస్క్ :** 1 టీస్పూన్ బెల్లం, 1 టీస్పూన్ నిమ్మరసం **ఎలా ఉపయోగించాలి?**

బెల్లం, నిమ్మరసం కలిపి పేస్టులా చేసుకోవాలి. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి గోరువెచ్చని నీటితో కడిగేయండి. ఈ మాస్క్ స్కిన్ టోన్ మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మకాయలోని ఆస్ట్రింజెంట్ లక్షణాల వల్ల మొటిమలు తగ్గిస్తుంది.

**బెల్లం, అలోవెరా జెల్ :** 1 టీస్పూన్ బెల్లం, 1 టీస్పూన్ తాజా అలోవెరా జెల్, **ఎలా ఉపయోగించాలి?**

అలోవెరా జెల్‌తో బెల్లం మిక్స్ చేసి ముఖానికి 10-15 నిమిషాల పాటు అప్లై చేయాలి. ఈ ఓదార్పు ముసుగు చర్మాన్ని హైడ్రేట్ చేయడానికి, వడదెబ్బ లేదా చికాకును నయం చేయడానికి సహాయపడుతుంది.

## సరికొత్త సీరియల్

# చాకిరేవు



(గతవారం తరువాయి).

ఎప్పుడైతే వంకలో నీరు వచ్చి తమ బతుకులను నాశనం చేసిందో అప్పటి నుండి నీటి మీద అసహ్యం పెంచుకుంది. గంగమ్మ కనికరం, చల్లనిచూపు లేక పోవడం వల్లే బతుకులు రోడ్డుపాలు అయ్యాయని భావించింది. అందుకే నారాయణ పేరు వద్దని వారించింది.

'అన్నం మీద, పని మీద, దేవుడి మీద కోపం పెంచుకోకూడదని, ఏది జరిగినా మంచికే జరగుతుందని, నారు పోసిన వాడికి నీరు పోయడం తెలియదా? నారాయణుడు మన ఇంటి దైవం, దేవుడి పేరు పెడితే పిల్లాడు ఆరోగ్యంగా ఉంటాడనింది.'

సుబ్బక్క ఎంత చెప్పినా పిల్లాడికి నారాయణ అని పెట్టడం పాపులమ్మకు ఇష్టం లేదు. సుబ్బక్కకు ఎదురు చెప్పడం ఇష్టం లేక, తల్లి మాటకు గౌరవం ఇవ్వాలని ఒప్పుకుంది.

పిల్లాడికి పేరు పెట్టి అచ్చుక్క పుట్టింటికి, ఇతర దగ్గరి బంధువులకు తీపి పంపారు.

***

పాపులమ్మ బాలింతగా ఉన్న సమయంలో అచ్చుక్క నారాయణకు ఎలా స్నానం చేయించేదో చూడలేదు. అచ్చుక్కకు నారాయణ మీద ప్రేమ ఉంది కానీ పాపులమ్మది తల్లి ప్రేమ. పెంచుకున్న ప్రేమకు, తల్లి ప్రేమకు వ్యత్యాసం ఉంటుంది.

నారాయణకు స్నానం చేయించడానికి పొయ్యి మీద వేడి నీళ్లు పెట్టారు. నారాయణకు వేయాల్సిన బట్టలు, ఇతర సామాగ్రి తీసుకొని పొయ్యికి కాస్త దూరంలో పీట మీద కూర్చుంది. పిల్లాడి కోసం వేడి నీళ్లను బకెటులో తోడారు. అందులో చల్లనీళ్లు తోడలేదని అచ్చుక్కకు తెలియదు.

చల్లనీళ్లు తోడుకోమని అచ్చుక్కకు చెప్పి పాపులమ్మ సుబ్బక్క పిలిస్తే గుడిసెలోకి వెళ్లింది. పాపులమ్మ చెప్పింది వినపడలేదో, మర్చిపోయిందో తెలియదు కానీ టక్కున వేడి నీళ్లను నారాయణ కాళ్ల మీద వేసింది. నారాయణ గట్టి గట్టిగా కేకలు పెట్టాడు, క్షణాల్లో నారాయణ పాదాలు కందిపోయాయి.

'నారాయణను చంపేసిందే' ఈ మతి లేనిది అంటూ సుబ్బక్క గట్టి గట్టిగా అరిచింది.

అచ్చుక్క భయంతో హడలిపోయింది, నారాయణ బాధను చూసి తట్టుకోలేక పోయింది. నారాయణ కాళ్ల మీద బొబ్బలు వచ్చాయి. నారాయణ గోంగెలు పెట్టి ఏడ్చాడు. పిల్లాడిని తీసుకొని పాపులమ్మ ఫకీరప్ప దగ్గరకు పరిగెత్తింది. ఆదెన్న వంకకు వెళ్లాడు. నారాయణకు అలా జరగడాన్ని చూసి గంగ తట్టుకోలేకపోయింది. తల్లి వెనుకే తనూ పరిగెత్తింది. అచ్చుక్క, సుబ్బక్క కూడా వాళ్లను అనుసరించారు.

'ఫక్కీరప్పన్నా పిల్లాడికి నొప్పి లేకుండా చూడు, వాడలా ఏడుస్తుంటే నా గుండె ఆగిపోయినట్టు అనిపిస్తోందని' పాపులమ్మ ఏడ్చింది.

పిల్లాడికి ఏదో మందు పూశాడు. మరేదో పత్యం చెప్పి, పిల్లల విషయంలో తల్లే జాగ్రత్తగా ఉండాలి, ఇంట్లో ఎవరికీ పిల్లల పనులు చెప్పకూడదు. ఎవరూ కావాలని చేయరు కానీ తల్లి అయితేనే పిల్లలను జాగ్రత్తగా చూసుకోగలదు. తల్లిలా మరెవరూ చూసుకోలేరని గుర్తించుకో' మందలింపుగా చెప్పాడు.

ఫక్కీరప్ప చెప్పిన మాటలు అచ్చుక్క విని, కుమిలి కుమిలి ఏడ్చింది. తను తల్లిని కాదు కనుకే నిర్లక్ష్యంగా ఉన్నానా అనుకుంది. అచ్చుక్క పిచ్చిదేమి కాదు, కాస్త చురుకుదనం లేదంతే.

పాపులమ్మ అచ్చుక్కను ఒక్కమాట కూడా అనలేదు. అందరూ కలిసి గుడిసెకు చేరుకున్నారు. ఆదెన్న వంక నుండి గుడిసెకు చేరుకున్నాడు. నారాయణను అలాంటి పరిస్థితిలో చూసి పాపులమ్మ మీద ఎగిరాడు.

సుబ్బక్క కలగజేసుకొని 'అది పాపులమ్మ తప్పేమీ కాదు, నీ తమ్ముడి భార్య ఈ పిచ్చి మాలోకం చేసిన ఘనకార్యం' కోపంగా, ఆవేశంగా అచ్చుక్కను అరిచింది.

'నారాయణ ఎవరి దగ్గర ఉన్నాడు? ఏం చేస్తున్నాడనే ధ్యాస లేకుండా నిద్రపోతున్నావా? ఇంకోసారి పిల్లాడికి ఏమైనా జరిగితే నీ అంతు చూస్తానని హెచ్చరించాడు' మాములుగా అయితే ఆదెన్న ఎప్పుడూ పాపులమ్మ మీద అరిచింది లేదు. నారాయణ పాదాలను చూసి ఆదెన్న తట్టుకోలేకపోయాడు, తండ్రి మనసు తల్లడిల్లింది.

'నువ్వు చేసిన పనికి పిల్లాడు ఎంతగా బాధపడుతున్నాడో చూడు, నువ్వు ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుండి మాకు శని పట్టుకుంది' సుబ్బక్క నోరు అదుపు తప్పింది.

'అమ్మా.. నువ్వు ఇక్కడి నుండి వెళ్లు, బకెటులో చల్లనీళ్లు తోడుతున్న సమయంలో నువ్వు పిలిచావు.. దాంతో అచ్చుక్కకు చెప్పి వచ్చాను. బహుశా! తనకు వినపడలేదు అంతే, దీన్ని ఇంతటితో వదిలేయ్' తల్లిని కసిరింది.

'నేనే చేశానంటావా? ఊరికే ఇంట్లో పడి ఉన్నాననే కదా ఇన్ని మాటలు అంటున్నది. ఇది నీ పిల్లాడిని దక్కకుండా చేస్తుందని ముందు నుండే చెప్తున్నా కూడా వినలేదు. ఎప్పుడూ నీ మీద అరవని అల్లుడు ఎన్ని మాటలు అన్నాడో చూశావా?'

తల్లితో మాటలు కొనసాగించడం వల్ల ప్రయోజనం లేదని నారాయణను తీసుకొని పాపులమ్మ పక్క గుడిసెలోకి వెళ్లింది. ఇంటి పని, వంట పని పూర్తి చేసుకొని అచ్చుక్క కూడా పక్క గుడిసెలోకి వెళ్లింది. పాపులమ్మ నారాయణ పాదాలను పట్టుకొని కన్నీరు పెడుతూ కనపడింది.

'అక్కా.. నన్ను క్షమించు, కావాలని చేయలేదు. నువ్వు చెప్పింది వినపడలేదు, నారాయణకు ఇలా జరగడానికి కారణం నేనే' గట్టిగా చెంపలను వాయించుకుంది.

నారాయణను మంచం మీద పడుకోబెట్టి అచ్చుక్క దగ్గరికి వెళ్లి 'పొరపాటు జరిగిందని నాకు తెలుసు, అమ్మ మాటలను పట్టించుకోవద్దు.'

'జాగ్రత్తగా ఉండాల్సింది, నేనిక్కడే ఉంటే మీ మధ్య గొడవలు వచ్చే ప్రమాదం ఉంది. నాకిక్కడ ఉండటానికి అర్హత లేదని అర్థమౌతోంది, రేపే ఇంటికి వెళ్లిపోవాలనుకుంటున్నాను.'

'ఇలాంటివి అందరి ఇళ్లల్లో జరుగుతూనే ఉంటాయి. అంతదానికే మనసు నొచ్చుకొని ఆవేశంలో అనాలోచితమైన నిర్ణయాలు తీసుకుంటే ఎలా? తప్పకుండా గంగులు వస్తాడు. మీకు పిల్లలు కూడా కలుగుతారు. కష్ట సమయం లో ఓర్పుగా, నేర్పుగా ఉండాలే కానీ గాబరాపడకూడదు' అచ్చుక్కను సముదాయించింది.

పిల్లాడి పాదాల వైపు చూస్తూ అచ్చుక్క కుమిలిపోయింది. నా మతిలేనితనం వల్ల పిల్లాడు ఎంత బాధ అనుభవించాల్సి వచ్చిందని తలుచుకొని తలుచుకొని ఏడ్చింది. ఇకనుండి నారాయణను తీసుకోకూడదని నిర్ణయించుకుంది.

అప్పటినుండి ఇంటి పనులు చేయడం తప్ప నారాయణను తీసుకోలేదు. సుబ్బక్క ఊపిరి పీల్చుకుంది, నారాయణను అచ్చుక్కకు దూరంగా పెట్టడమే తన లక్ష్యంగా భావించింది.

పిల్లాడితో కొన్ని నెలల పాటు కష్టాలను మర్చిపోయినా ఒంటరితనం మాత్రం వేటాడింది. నారాయణను తీసుకోవాలని, ముద్దాడాలని మనసు ఎంత ఉబలాటం చెందినా బలవంతంగా సమాలించుకుంది.

నారాయణను అచ్చుక్క కావాలనే దూరం పెడుతోందని పాపులమ్మకు అర్థమయ్యింది. ఆ పని ఉంది, ఈ పని ఉందంటూ కావాలనే నారాయణను అచ్చుక్కకు ఇచ్చే ప్రయత్నం చేసింది పాపులమ్మ. అచ్చుక్క నారాయణను తీసుకోకుండా సుబ్బక్కకు ఇవ్వడం, లేదంటే నాకు కూడా పని ఉందని చెప్పడం చేసింది.

'చూడు అచ్చుక్క, ఎవరో ఏదో అన్నారని మనసు చంపుకొని నువ్వు పిల్లాడిని తీసుకోకపోతే ఎలా? వాడికి చిన్నమ్మ ప్రేమ తెలియాలి, నువ్విలా నారాయణను దూరం పెట్టడం నాకు నచ్చలేదు. ముందులా నువ్వే నారాయణకు అన్ని పనులు చేయాలి.'

'వద్దక్కా.. నా మనసు బాగుండటం లేదు, నా మతిలేనితనం వల్ల నారాయణ ఎంత బాధపడ్డాడో చూశావు కదా! మరోసారి అలా జరగకూడదంటే దూరం నుండి నారాయణను చూసుకుంటూ సంతోషపడతాను.'

'ఇంకేమీ మాట్లాడకు, ఇదిగో నారాయణను తీసుకొని ఆడిస్తూ ఉండు. నేను వంట పని పూర్తి చేసి వస్తానని బలవంతంగా పిల్లాడిని అచ్చుక్కకు ఇచ్చింది.'

చాలా రోజుల తర్వాత నారాయణను మనస్ఫూర్తిగా దగ్గరికి తీసుకుంది. గట్టిగా యదకు హత్తుకొని కన్నీరు పెట్టుకుంది. నారాయణ పాదాల మీద ముద్దుల వర్షం కురిపించింది. నన్ను క్షమించురా కన్నయ్య అంటూ గోముగా నుదుటి మీద నిమిరింది.

వంట చేస్తున్న పాపులమ్మ దగ్గరికి వెళ్లి 'నారాయణను దానికి ఇచ్చావా?' సుబ్బక్క ఆవేశంగా అడిగింది.

'అచ్చుక్కను మనం కాకపోతే ఇంకెవరు అర్థం చేసుకుంటారు? తన పరిస్థితి చూసి కూడా నువ్వలా ప్రవర్తించడం నాకు నచ్చడం లేదు. దయచేసి ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని ఖరాఖండిగా చెప్పింది.'

'పెద్దలు చెప్తే ఎందుకు వింటారు? రేపు ఏదైనా జరగరానిది జరిగితే నీ సంసారం రోడ్డు మీద పడుతుందనే నా బాధ, పైగా దాని మతిలేనితనం వల్ల నారాయణకు ఏదైనా హానీ తలపెడుతుందని భయపడుతున్నాను' అచ్చుక్క మీద నాకేమీ కోపం లేదంటూ వదురుకుంటూ వెళ్లిపోయింది.

***

పెద్దకోటయ్యకు వేముల పల్లెలో చిల్లరఅంగడి ఉంది. వేముల పల్లె ప్రజలు మాత్రమే కాకుండా గంగాదేవిపల్లె, గొల్లలగూడురు, బక్కన్నగారిపల్లె, చెర్లోపల్లె లాంటి చాలా పల్లెల వాళ్లు కూడా పెద్దకోటయ్య అంగడికే వెళ్తారు.

పెద్దకోటయ్యకు ఒకే ఒక కొడుకు, చర్చ్ స్కూల్ లో చదువుతున్నాడు. కొడుకు పేరు ఏదో పెట్టారు కానీ ఎవరికీ తెలియదు. అందరూ చిన్నకోటయ్య అనే పిలుస్తారు. కోటయ్య భార్య పేరు వరలక్ష్మి అయితే కోటయ్య ప్రేమగా వరాలు అని పిలుచుకుంటాడు.

వరలక్ష్మి వాళ్లది పెద్దగా ఉన్న కుటుంబం కాదు, కాయా కష్టం చేసుకొని బతికే వాళ్లు. పెద్దకోటయ్య వరలక్ష్మిని ఒక పెళ్లిలో చూసి ఇష్టపడ్డాడు. కోటయ్య తల్లిదండ్రులకు వరలక్ష్మి అంటే ఇష్టం లేదు. నయాపైసా లేని వాళ్ల ఇంటి నుండి అమ్మాయిని తెచ్చుకుంటే ఎలా? అన్నది వాళ్ల వాదన, బాధ.

తల్లిదండ్రులను ఎదిరించలేక పెద్దకోటయ్య వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఆ అమ్మాయి రెండేళ్ల తర్వాత ఎవరినో తీసుకొని వెళ్లిపోయింది. ముందే ప్రేమలో పడిందో, పెళ్ళైన తర్వాత పడిందో తెలియదు కానీ మొత్తానికి వెళ్లిపోయింది. పల్లెలో పరువు పోయినట్టు అయ్యింది. మరో పెళ్లి చేసుకోడానికి ప్రయత్నిస్తున్న సమయంలో వరలక్ష్మి అయితే బీదది కాబట్టి పడి ఉంటుందని తల్లిదండ్రులను కోటయ్య ఒప్పించాడు. చేసేది లేక సరేనన్నారు. అలా వరలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.

వరలక్ష్మికి నలుగురు అక్కాచెల్లెలు, ఒక తమ్ముడు. కోటయ్య కంటే వరలక్ష్మి చాలా చిన్నది. కోటయ్యను పెళ్లి చేసుకుంటే మిగిలిన ఆడపిల్లల పెళ్లిల్లు అవుతాయని మారు మాట్లాడకుండా ఒప్పుకుంది. పెద్దకోటయ్య అంటే వరలక్ష్మికి ప్రేమ కాదు అవసరం.

పెద్దకోటయ్య, స్వామి, కొండారెడ్డి మాంచి స్నేహితులు. అప్పుడప్పుడు పులివెందులలో ఉన్న వెంకట్ రెడ్డి వేశ్య కొంపకు వెళ్తారు. కొత్త ఆడపిల్ల వస్తే పెద్దకోటయ్యకు, కొండారెడ్డికి తప్పకుండా వెంకట్ రెడ్డి కబురు పంపుతాడు. ఎంతోమంది అమ్మాయిల మాన, ప్రాణాలను బలితీసుకున్న మృగాలు వాళ్లు.

వరలక్ష్మి చెల్లెల్ల పెళ్లిల్లు అయిపోయాయి, వాళ్ల సంసారాలు సాఫీగా సాగుతున్నాయి. తమ్ముడు పెళ్లి చేసుకొని తల్లిదండ్రులను చూసుకోవడం లేదు. ఉన్న ఇంటిని కూడా తన పేరు మీద రాయించుకున్నాడు. దాంతో వరలక్ష్మి తల్లిదండ్రులు వేరే ఇంటిని అద్దెకు తీసుకొని చిల్లరఅంగడి పెట్టుకొని బతుకు ఈడుస్తున్నారు.

వరలక్ష్మి అప్పుడప్పుడు తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి చూసుకుంటుంది. మిగిలిన చెల్లెల్లు తల్లిదండ్రులకు అండగా ఉండాలనుకున్నా ఏవేవో కారణాల వల్ల సాధ్యపడలేదు. అందుకే నెలకో, మూడు నెలలలో పలకరించడం తప్ప బాగోగోలు చూసుకోలేకపోయారు. అదొక సాకు అని సమాజానికి తెలియదా?

***

పెద్దకోటయ్య అంగడి హడావిడిగా ఉంది. అంగట్లో ఇద్దరు పని చేసేవాళ్లు ఉన్నారు. సరుకులను తూకం వేయడం, అంగడికి వెళ్లినవాళ్లకు సరుకులు కట్టి ఇవ్వడం వాళ్ల పని.

కోటయ్య డబ్బులు తీసుకుంటాడు. కోటయ్యది బాణపొట్ట, కుర్చీలో కూర్చుంటే లేవలేడు, లేవడానికి ఎవరో ఒకరు సహాయం చేయాల్సిందే. కోటయ్య మాంచి మాటకారి, అంగడికి వెళ్లే ప్రతి ఒక్కరితో సరదాగా మాట్లాడతాడు, ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాడు. నవ్వుతూనే డబ్బు ఎక్కువగా తీసుకుంటాడని చాలామంది ఆరోపణ, అందులో నిజం లేకపోలేదు.

నెల సరుకుల కోసం వెళ్లే వాళ్లు గత నెలలో ఏ సరుకులు ఎన్ని తీసుకుపోయారో కూడా ఇట్టే చెప్పేస్తాడు. అంగడికి వెళ్లే వాళ్ల ఇళ్ళలో ఎంతమంది ఉన్నారు? ఎవరెవరు ఏం చేస్తున్నారు లాంటి విషయాలన్నీ గుర్తు పెట్టుకుంటాడు. సరుకుల కోసం వెళ్లినప్పుడు వాళ్ల కుటుంబ విషయాలు అడిగి మాటల్లో పెడతాడు. అరకిలో బియ్యం అడిగితే, కిలో అంటగడతాడు. సరుకులు ఎక్కువగా కొనేలా మునగచెట్టు ఎక్కిస్తాడు. బతుకుతున్నది తినడానికేనన్న జీవిత సూక్తిని గుర్తు చేస్తాడు.

పల్లెలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల పల్లెల్లో కూడా కోటయ్యకున్నంత పెద్ద అంగడి ఎవరికీ లేదు. ఏదో చిన్న చిన్న బొంకులు తప్ప కోటయ్యకు ఉన్నట్లు ఇంట్లోనే పెద్ద అంగడి ఎవరికీ లేదు. పెద్దకోటయ్య అంగడి దిక్కులకు పెరేల్లింది.

కోటయ్య అంగట్లో దొరికే ఊరగాయలు, పిండి వంటలంటే చాలామంది పడిచస్తారు. బాపనోళ్ళ దగ్గర తక్కువకు పిండి వంటలు కొని అమ్ముతాడు. ప్రత్యేకంగా మామిడి, ఉసిరి, నిమ్మ, మిరప లాంటి ఎన్నో రకాల ఊరగాయలు అమ్మడం ద్వారా ఎక్కువగా డబ్బు వస్తుంది.

‘ (మిగతా వచ్చేవారం)

జాని తక్కెడశిల
7259511956






# ఆదరణ కొరవడి అంతరించిపోతున్న భాషలు

**భావ వ్యక్తీకరణకు మూలం భాష. భాషలేవీ మనుగడలో లేని ఆదిమానవుల కాలంలో, వారు సౌంజ్ఞలు చేయడం, అగ్ని, పొగ రాజేయడం, తప్పెట్లపై దరువు వేయడం, నోటితో ధ్వనులు చేసి తమ ఆలోచనలు మరియు భావాలను వ్యక్తపరిచేవారని అధ్యయనకారుల అభిప్రాయం. ప్రపంచంలో ఏర్పడిన మొట్టమొదటి భాషకు సంబంధించి ఖచ్చితమైన ఋజువులేవీ అందుబాటులో లేనప్పటికీ 50,000 నుండి 200,000 సంవత్సరాల క్రితం భాష అభివృద్ధి చెంది ఉండవచ్చని నిపుణుల అభిప్రాయం. చరిత్రలో, వివిధ నాగరికతలు తమ స్వంత భాషలను అభివృద్ధి చేసుకున్న విషయం మనకు తెలిసిందే. కొన్ని దేశాలలో ఏకైక ఆధిపత్య భాష ఉండగా, మరికొన్ని అనేక భాషలకు నిలయంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉనికిలో ఉన్న మరియు ఉనికి కోల్పోయిన భాషలపై విస్తృత పరిశోధనలు చేస్తున్న అమెరికాకు చెందిన ఎథ్నోలాగ్ సంస్థ పరిశోధకుల ప్రకారం, ఫిబ్రవరి 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సుమారు 7,139 భాషలు మాట్లాడుతున్నప్పటికీ నానాటికీ వాటి సంఖ్య తగ్గుముఖం పడుతుండటంతో పాటు కొన్ని భాషలు పూర్తిగా అంతరించిపోయే పరిస్థితులు ఏర్పడడంపై భాషాప్రేమికులు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైతే ప్రజలు తమ మాతృభాష పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తరువాతి తరాలకు బోధించడంలో అలసత్వం వహిస్తారో, అది తప్పనిసరిగా ఆ భాష అంతరించిపోవడానికి కారణమవుతుంది.**

26 ఏప్రిల్ 2023 నాటికి సవరించబడిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యయనం ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలోని ఒక చిన్న ద్వీపంలో గల పపువా న్యూ గినియా 850కి పైగా భాషలకు నిలయంగా ఉంటూ ప్రపంచంలోని అత్యధిక భాషలు గల దేశాల జాబితాలో మొదటి స్థానం ఆక్రమించుకుంది. ఈ దేశానికే పరిమితమైన అత్యధిక భాషలను ప్రస్తుతం కేవలం కొన్ని వందలు లేదా వేల మంది మాత్రమే మాట్లాడతారు. 17 వేల ద్వీపాలతో ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపసమూహం ఇండోనేషియా. అధికారిక భాష బహాసా ఇండోనేషియా, జావానీస్ మరియు సుండానీస్ తో పాటు 700 కంటే ఎక్కువ భాషలతో 270 మిలియన్లకు పైగా జనాభా గల ఈ చిన్ని దేశం రెండవ స్థానంలో ఉంది. 200 మిలియన్లకు పైగా జనాభాతో ఆఫ్రికా ఖండంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఉన్న నైజీరియా 500 కంటే ఎక్కువ భాషలతో మూడవ స్థానంలో ఉంది. ఇక్కడ అత్యధికులు మాట్లాడే భాషలు హౌసా, యోరుబా మరియు ఇగ్బో. దాదాపు 1.42 మిలియన్ల జనాభాతో ఇటీవల చైనాను వెనక్కు నెట్టి ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం స్థానాన్ని కైవసం చేసుకున్న భారతదేశం 450 పైగా భాషలతో నాల్గవ స్థానంలో ఉంది. విభిన్న జాతులు, సంస్కృతులు మరియు ఆచారవ్యవహారాలకు ఆలవాలమైన భారతదేశంలో జాతీయ అధికారిక భాషలుగా హిందీ మరియు ఇంగ్లీష్ కొనసాగుతుండగా అత్యధికులు మాట్లాడే భాషలు హిందీ, బెంగాలీ మరియు తెలుగు. హిందీ మరియు బెంగాలీ భాషీయులు మాతృభాషకు ప్రాధాన్యతనిస్తూ మమకారం చాటుకుంటున్నప్పటికీ, 'తెలుగు' వారు అత్యధికులు మాతృభాష పట్ల నిర్లిప్త వైఖరి ప్రదర్శిస్తూ తెలుగు భాషా ప్రాభవం క్షీణతకు కారణమవడం దురదృష్టకరం.

(మిగతా 8వ పేజీలో)






(7వపేజీ తరువాయి)

ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా పిలవబడే అమెరికా, 364 భాషలతో ఐదవ స్థానంలో ఉంది. యుఎస్ సెన్సస్ బ్యూరో ప్రకారం, అమెరికాలో అధిక సంఖ్యాకులు (239 మిలియన్లు) మాట్లాడే ఇంగ్లీష్ కాకుండా విస్తృతంగా మాట్లాడే ఇతర భాషలలో స్పానిష్, చైనీస్, తగలోగ్, వియత్నామీస్ మరియు అరబిక్ ఉన్నాయి. వీటితో పాటు నవాజో, యుపిక్, దకోటా, అపాచీ, కెరెస్ మరియు చెరోకీ వంటి స్థానిక ఉత్తర అమెరికా భాషలను కూడా కొందరు మాట్లాడతారు. ఆ తరువాత ఆరవ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా యొక్క జాతీయ భాష ఇంగ్లీష్ అయినప్పటికీ అక్కడి ప్రజలు అనేక దేశీయ భాషలతో సహా దాదాపు 320 భాషలను మాట్లాడతారు. 2021 జనాభా లెక్కల ప్రకారం 72 శాతం ప్రజలు ఇంట్లో ఇంగ్లీష్ మాత్రమే మాట్లాడతారు. ఎథ్నోలాగ్ ప్రకారం, చైనాలో 300 కంటే ఎక్కువ సజీవ భాషలు ఉన్నాయి. వీటిలో కొన్ని చైనీస్ లేదా సినిటిక్ భాషలకు చెందినవి, మరికొన్ని మంగోలియన్ మరియు టర్కిక్ వంటి విభిన్న భాషా సమూహాలకు చెందినవి. ఆసియా ఖండంలోని శక్తివంతమైన దేశాలలో ఒకటైన చైనా 308 భాషలతో ఏడవ స్థానంలో ఉంది. స్థానికులతో పాటు అనేక జాతుల సమూహాలతో కూడిన మెక్సికో దాదాపు 304 భాషలతో ఎనిమిదవ స్థానంలో ఉంది. దేశంలోని అత్యధికులు జాతీయ మరియు పాఠశాలల్లో బోధనా భాష అయిన స్పానిష్ మాట్లాడతారు. దీనికి తోడు మాయ, నహువా, జపోటెక్, యుకాటెక్, మజాటెక్ భాషలు కూడా మాట్లాడతారు. మధ్య ఆఫ్రికాలో గల కామెరూన్ 281కి పైగా భాషలతో వైవిధ్యమైన భాషల పరంగా తొమ్మిదవ స్థానంలో ఉంది. అయినప్పటికీ, అక్కడ అధిక సంఖ్యాకులు దేశ అధికారిక భాషలైన ఫ్రెంచ్ మరియు ఆంగ్లంలో విస్తృతంగా మాట్లాడతారు. 240 భాషలతో వైవిధ్యమైన భాషలు గల దేశాల జాబితాలో బ్రెజిల్ పదవ స్థానంలో ఉంది. ఇక్కడ పోర్చుగీస్ అధికారిక భాష అయినప్పటికీ, అనేక స్థానిక భాషలు అభివృద్ధి చెందుతూ సాంస్కృతిక ప్రాభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి.

**ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడబడుతున్న పది భాషలు:**

ఎథ్నోలాగ్ ప్రకారం, స్థానిక మరియు మాతృభాషేతరులతో సహా ప్రపంచంలో అత్యధికంగా 1456మిలియన్ల మంది ఇంగ్లీష్ మాట్లాడతారు. మధ్యయుగంలో ఇంగ్లాండ్‌లో ఉద్భవించి వ్యాపారం, పర్యాటక, సాంకేతిక, వైద్య, రంగం ఏదైనా కానీ అంతర్జాతీయ భాషగా పరిగణించబడుతున్న ఈ భాష ఇప్పుడు 67 దేశాలలో అధికారిక భాషగా కొనసాగుతోంది. మాండరిన్ నిజానికి ఒక భాష కాదు కానీ చైనీస్ భాష యొక్క మాండలికాల సమితి. 1138 మిలియన్ల మంది మాండరిన్ మాట్లాడగా, వారిలో అత్యధికులు చైనాలో ఉన్నారు. సంక్లిష్టమైన ఈ భాషలో అక్షరాలు శబ్దాల కంటే నేరుగా అర్థాలనే సూచిస్తాయి. 610 మిలియన్ల మంది మాట్లాడే హిందీ భారతదేశంలోని 22 అధికారిక భాషలలో ఒకటి. ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాలతో పాటు నేపాల్ జనాభాలో నాలుగింట ఒక వంతు మంది హిందీ మాట్లాడతారు. మొత్తం 559 మిలియన్ల మందిని కాకుండా స్థానికంగా మాట్లాడేవారి సంఖ్యాపరంగా చూస్తే ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే రెండవది మరియు ఇంటర్నెట్‌లో ఎక్కువగా ఉపయోగించే మూడవ భాష స్పానిష్. స్పెయిన్ వలసరాజ్యాల విస్తరణ కారణంగా అమెరికా, ఆఫ్రికా మరియు ఆసియాలకు విస్తరించడంతో ఈ భాషను ప్రపంచంలోని 21 దేశాలలో మాట్లాడుతున్నారు. అంతేకాదు, ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో స్పానిష్ మాట్లాడే రెండవ దేశం అమెరికా! వలసరాజ్యాల విస్తరణతో ఫ్రెంచ్ కూడా నేడు ప్రపంచ




వ్యాప్తంగా 29 దేశాలలో 310 మిలియన్ల మంది ద్వారా మాట్లాడబడుతోంది. ఇది యునైటెడ్ నేషన్స్, యూరోపియన్ యూనియన్, యునెస్కో, హూ, న్యాటో మరియు మరిన్ని సంస్థల అధికారిక భాషలలో ఒకటి. సాధారణంగా వార్తాపత్రికలు, టీవీ ప్రసారాలు మరియు చలనచిత్రాలలో ఉపయోగించబడే మోడ్రన్ స్టాండర్డ్ అరబిక్ భాషను 274 మిలియన్ల మంది మాట్లాడుతారు. బంగ్లాదేశ్ అధికారిక భాష బెంగాలీ. 273 మిలియన్ల మంది మాట్లాడే బెంగాలీ భాష, భారతదేశం మరియు బర్మాలోని కొన్ని ప్రాంతాలలో కూడా మాట్లాడబడుతుంది. భారతదేశంలోని వినసొంపైన భాషలలో ఒకటైన బెంగాలీకి రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి నోబెల్ గ్రహీతలు ప్రపంచ ఖ్యాతినార్జించడంలో సహాయపడ్డారు. యూరోపియన్ వలసరాజ్యాల కాలంలో ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన మరొక భాష పోర్చుగీస్. పోర్చుగీస్ మాట్లాడే వారిలో కేవలం 5 శాతం మాత్రమే పోర్చుగల్‌లో నివసిస్తుండగా ఇది ఐరోపా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా మరియు బ్రెజిల్ సహా ఆసియాలోని తొమ్మిది దేశాలలో అధికారిక భాష. బ్రెజిల్‌లో అత్యధికంగా పోర్చుగీస్ మాట్లాడేవారున్నారు. భూభాగం ప్రకారం ప్రపంచంలోనే అతిపెద్ద దేశమైన రష్యా యొక్క రష్యన్ భాష ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా మాట్లాడే భాషలలో ఒకటి. రష్యన్ కేవలం నాలుగు దేశాల అధికారిక భాష అయినప్పటికీ, ఇది 19 దేశాలలో 255 మిలియన్ల మంది ద్వారా విస్తృతంగా మాట్లాడబడుతుంది. పాకిస్తాన్‌లోని రెండు అధికారిక భాషలలో ఒకటైన ఉర్దూను భారతదేశంలోని కొన్ని ప్రాంతాలతో సహా ప్రపంచవ్యాప్తంగా 232 మిలియన్ల మంది మాట్లాడుతున్నారు.

**భాషల గురించి కొన్ని వాస్తవాలు:**

-ఖండాలవారీగా భాషల సంఖ్యను పరిశీలిస్తే, వాషింగ్టన్ పోస్ట్‌లోని ఒక కథనం ప్రకారం, ఆసియాలో అత్యధికంగా దాదాపు 2300 భాషలు, ఆఫ్రికాలో దాదాపు 2000, అమెరికా మరియు ఓషియానియాలలో చెరి 1000 మరియు ఐరోపాలో 280 భాషలు మాత్రమే ఉన్నాయి.

-యునెస్కో ప్రకారం, భారతదేశంలోని 197 భాషలు అంతరించిపోయే దశలో ఉన్నాయి. వాటిలో 81 ప్రమాదపుటంచున ఉండగా, 111 ఖచ్చితంగా అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. ఐదు ఇప్పటికే అంతరించిపోయాయి.

-ఒక భాష 10,000 కంటే తక్కువ మంది మాట్లాడినట్లయితే ఆ భాషను "అంతరించిపోయే ప్రమాదం" ఉన్న భాషగా పరిగణిస్తుంది యునెస్కో. భారతదేశంలో 100 కంటే ఎక్కువ భాషలు ఈ కోవకు చెందడం గమనార్హం.

-భారత ప్రభుత్వం అస్సామీస్, బెంగాలీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒరియా, పాలి, ప్రాకృత్, సంస్కృతం, తమిళం మరియు తెలుగును సాంప్రదాయ భాషలుగా గుర్తించింది. ఇవి వాటి సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యత మరియు ఆధునిక భాషలు, సాహిత్యంపై వాటి ప్రభావం కోసం అధ్యయనం చేయబడతాయి.

-2015లో సాహిత్య అకాడమీ వార్షిక సాహిత్య ఉత్సవంలో జరిగిన సమావేశంలో భారతదేశంలో లిపి ఉన్న భాషల కంటే లిపి లేని భాషలు ఎక్కువగా ఉన్నాయని, ఈ భాషలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని కనుగొన్నారు.

-బ్రాహ్మి, గుప్త, కుటిల, నగరి, నందినగరి, శారద, గ్రంథ, ఖరోష్ఠి, వట్టెలుటు మరియు కైతి భారతదేశానికి చెందిన కొన్ని పురాతన లిపిలు

-1774లో జన్మించిన కార్డినల్ గియుసేప్ కాస్పర్ మెజోఫాంటి 38 భాషలు మరియు 40 మాండలికాలు మాట్లాడేవారు అని అంటారు.

-10వ శతాబ్దపు ముస్లిం పాలిమత్, అల్-ఫరాబీకి 70 భాషలు తెలిసు అని అంటారు.

ప్రపంచంలోని భాషల సంఖ్య నిరంతరం మారుతూ ఉంటుంది. కాలగమనంలో కొన్ని కొత్త భాషలు పుట్టుకొస్తుండగా కొన్ని అంతరించిపోతుంటాయి. నిజానికి, ప్రపంచంలోని భాషల్లో కనీసం 43 శాతం భాషలు అంతరించిపోయే ప్రమాదం ఉందని భాషా నిపుణుల అభిప్రాయం.

**యేచన్ చంద్ర శేఖర్**
**8885050822**



దుల్కర్ సల్మాన్‌కు మలయాళంతో పాటు తెలుగులో కూడా మంచి ఫ్యాన్ బేస్ ఉంది. ఆయన ఎంపిక చేసుకునే వైవిధ్యమైన కథలు కొత్తదనాన్ని కోరుకునే ప్రేక్షకులకు ఆయనను దగ్గర చేశాయి. 2022లో వచ్చిన 'సీతారామం' పెద్ద హిట్ అయింది. ఆ తర్వాత మరోసారి 'లక్కీ భాస్కర్' అనే సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చారు. 'సర్'తో మంచి హిట్ కొట్టిన వెంకీ అట్లూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. టీజర్, ట్రైలర్లతో జనాల్లో మంచి ఆసక్తిని కలిగించిన ఈ సినిమా గురువారం ప్రీమియర్లతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా ఎలా ఉంది?

**కథ:** ఇది 1989వ సంవత్సరం నుంచి 1992 మధ్యలో జరిగే కథ. భాస్కర్ (దుల్కర్ సల్మాన్) ఒక మిడిల్ క్లాస్ బ్యాంక్ ఉద్యోగి. అతని భార్య సుమతి (మీనాక్షి చౌదరి). వీరికి ఒక కొడుకు (రిత్విక్). గంపెడు కుటుంబం ఉన్న భాస్కర్‌కి బ్యాంక్‌లో వచ్చే ఆరు వేల రూపాయల జీతం సరిపోదు. దీంతో ఊరంతా అప్పులు చేస్తాడు. ప్రేమ వివాహం కావడం వల్ల సుమతి ఇంట్లో వాళ్ళకి భాస్కర్ అంటే పడదు. డబ్బు లేదని చిన్న చూపు చూస్తారు. దీనికి తోడు బ్యాంక్‌లో న్యాయంగా తనకి రావాల్సిన ప్రమోషన్ వేరే వాళ్ళకి వెళ్తుంది. దీంతో భాస్కర్ బ్యాంక్ లో చిన్నగా ఒక స్కామ్ స్టార్ట్ చేస్తాడు. ఆ తర్వాత భాస్కర్ జీవితం ఏం అయింది? భాస్కర్ తప్పులు బయట పడ్డాయా? అసలు భాస్కర్ జీవితం చివరికి ఏం అయింది? అనేది తెలియాలంటే ' లక్కీ భాస్కర్ ' చూడాల్సిందే.

విశ్లేషణ: తెలుగులో ఫైనాన్షియల్ క్రైమ్ మీద వచ్చిన సినిమాలు చాలా తక్కువ. అందులోనూ బ్యాంకింగ్ సెక్టార్‌లో మీద వచ్చే నేరాల మీద వచ్చిన సినిమాలు ఇంకా తక్కువ. వెంకీ అట్లూరి 'లక్కీ భాస్కర్' ఆ కోవలోకే వస్తుంది. 1990ల్లో దేశాన్ని కుదిపేసిన ఒక స్టాక్ మార్కెట్ కుంభకోణం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. ఇప్పటి వరకు ఆ కుంభకోణం మీద వచ్చిన సినిమాలు కానీ, సిరీస్‌లు కానీ ప్రధానంగా ఆ స్కామ్ చేసిన వ్యక్తి చుట్టూ తిరిగాయి. కానీ అసలు ఆ స్కామ్ చుట్టూ ఏం జరిగింది? ఆ స్కామ్‌లో ఇన్వాల్వ్ అయిన అధికారుల జీవితాలు ఏంటి? అనే దాని మీద వెంకీ అట్లూరి ఫోకస్ చేయడం ప్లస్ పాయింట్. దీని వల్ల ఆ సినిమాలు, సిరీస్‌ల ఛాయలు దీనిపై పడలేదు.



భాస్కర్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేయడం, తన కథను భాస్కర్ చెప్పుకోవడం ప్రారంభించడంతో సినిమా ప్రారంభం అవుతుంది. డబ్బు లేని కారణంగా భాస్కర్ కుటుంబం ఎన్ని కష్టాలు పడింది? ఎన్ని అవమానాలు ఎదుర్కొంది? వంటి విషయాలను తక్కువ సీన్లలోనే చాలా ఎఫెక్టివ్‌గా, ఎమోషనల్‌గా చూపించారు. ఒక్కసారి భాస్కర్ ఇల్లీగల్‌గా డబ్బులు సంపాదించడం స్టార్ట్ చేశాక సినిమా గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగిపోతుంది. ప్రతి మూడు నాలుగు సీన్లకు ఒక హై పాయింట్ లేదా ట్విస్ట్ వస్తూనే ఉంటుంది. ఆడియన్స్‌ను స్క్రీన్ వైపు నుంచి కళ్లు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ముఖ్యంగా భాస్కర్ చేసే ప్రతి ఒక్క అడ్వెంచర్ అదే ఒక ప్రత్యేకమైన కథలా అనిపిస్తుంది. వీటన్నిటి కంటే హై ఇచ్చేలా, సెకండాఫ్ మీద బాగా ఇంట్రస్ట్ పెంచేలా ఇంటర్వెల్ ట్విస్ట్‌ను ప్లాన్ చేశారు.

సెకండాఫ్ నుంచి కథ మరో టర్న్ తీసుకుంటుంది. అసలైన స్టాక్ మార్కెట్ స్కామ్ సెకండాఫ్‌లోనే స్టోరీలోకి వస్తుంది. డబ్బు భాస్కర్‌ను ఎంతలా గాల్లోకి తీసుకెళ్లింది? భాస్కర్‌ను తిరిగి నేల మీదకు తీసుకువచ్చింది ఏంటి? అనే విషయాల్లో ఎమోషన్స్ బాగా వర్కవుట్ అయ్యాయి. ముఖ్యంగా ఇలాంటి సినిమాల్లో రైజ్, ఫాల్, మళ్లీ రైజ్... ఇలా హీరోయిజం గ్రాఫ్ ఉంటుంది. కానీ లక్కీ భాస్కర్‌లో మాత్రం రైజ్, రియలైజేషన్ మాత్రమే ఉంటాయి. చివర్లో మళ్లీ ఒక హై పాయింట్‌తో సినిమాను ఎండ్ చేస్తారు.

వెంకీ అట్లూరి ఈ సినిమా రైటింగ్‌లో చాలా స్పెషల్ కేర్ తీసుకున్నారు. మొదటి మూడు సినిమాల తర్వాత వెంకీ కేవలం లవ్ స్టోరీలు మాత్రమే తీయగలడు అనుకుంటే 'సర్'తో ఎడ్యుకేషన్ బేస్డ్ సినిమా తీసి హిట్ కొట్టాడు. ఇప్పుడు మళ్లీ ఎక్కువమంది టచ్ చేయని ఫైనాన్షియల్ క్రైమ్ సబ్జెక్ట్‌ని తీసుకున్నాడు. ఒక్క ఫైట్ సీన్ కూడా లేకపోయినా సినిమాలో చాలా చోట్ల ఎలివేషన్లు పడ్డాయి. దుల్కర్ ఫ్యామిలీ పడ్డ ప్రతి అవమానానికి తర్వాతి సీన్లలో సమాధానం ఉంటుంది. అలాగే డబ్బు నెత్తికెక్కాక దుల్కర్ చేసిన ప్రతి అవమానానికి ఒక క్షమాపణ ఉంటుంది. హీరో సారీ చెప్పినా కూడా ఆడియన్స్ శాటిస్‌ఫ్యాక్షన్ ఫీల్ అవ్వడం ఇందులో స్పెషల్. ముఖ్యంగా ఇందులో డైలాగ్స్ కూడా చాలా బాగా వచ్చాయి. 'వేగంగా నడిపే బండి, వేగంగా వచ్చే రూపాయి ఎప్పుడో ఒకసారి మనిషిని కింద పడేస్తాయి.' వంటి మాటలు సీన్ల స్థాయిని పెంచుతాయి. భాస్కర్ కొడుకు బర్త్‌డే తర్వాత వచ్చే ఎమోషనల్ సీన్ సినిమాలోని హైలెట్స్‌లో ఒకటి.

జీవీ ప్రకాష్ కుమార్ ఇచ్చిన పాటలు వినడానికి, స్క్రీన్‌పై కూడా బాగున్నాయి. అన్ని సాంగ్స్ దాదాపు మాంటేజ్‌లోనే రావడంతో కథను ఇబ్బంది పెట్టిన ఫీలింగ్ కలగదు. ముఖ్యంగా కొన్ని సీన్లలో తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాను నెక్స్ట్ లెవల్‌కి ఎలివేట్ చేసింది.

ఇక నటీనటుల విషయానికి వస్తే... దుల్కర్ సల్మాన్ మిడిల్ క్లాస్ భాస్కర్ పాత్రలో అదరగొట్టేశాడు. ముఖ్యంగా ఎమోషనల్ సీన్లలో తన అనుభవం కనిపిస్తుంది. మీనాక్షి చౌదరి రెగ్యులర్ గ్లామరస్ రోల్స్‌కు భిన్నంగా నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర చేశారు. చాలా బాగా నటించారు కూడా. దుల్కర్ కొడుకు పాత్ర చేసిన రిత్విక్ ఒక సీన్‌లో కన్నీళ్లు పెట్టిస్తాడు. మిగతా పాత్రధారులందరూ తమ పాత్రల మేరకు బాగా నటించారు.

ఓవరాల్‌గా చెప్పాలంటే... ఈ సినిమాలో భాస్కర్ ఎంత లక్కీనో, ఈ సినిమా దొరికినందుకు దుల్కర్ కూడా అంతే లక్కీ. 'లక్కీ భాస్కర్' లాగా 'లక్కీ దుల్కర్' అని కూడా అనేయచ్చు.

---

: మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన తాజా సినిమా 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. కొత్త దర్శకుడు రవితేజ ముళ్ళపూడి తీసిన ఈ సినిమాలో కథ ఏమిటి? కథనం ఎలా ఉంది? హీరో హీరోయిన్లు ఎలా నటించారు? వినోదం ఎలా ఉంది? వంటివి చూస్తే...

**కథ ):** రాకీ... రాకేష్ (విశ్వక్ సేన్) హైదరాబాద్ కుర్రాడు. లైఫ్ ఎంజాయ్ చేయడం తెలిసినోడు. ఫ్రెండ్ సిస్టర్, తన జూనియర్ ప్రియా (మీనాక్షి చౌదరి)తో ప్రేమ వ్యవహారం ఒకటి ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో కాలేజీ మానేసి వారసత్వంగా తండ్రి రామకృష్ణ (నరేష్) నుంచి వచ్చిన ఆర్కే గ్యారేజ్ బాధ్యతలు చూసుకోవాలసి వస్తుంది. గ్యారేజ్ సైట్ మీద రంకిరెడ్డి (సునీల్) కన్ను పడుతుంది.

గ్యారేజ్ కాపాడుకోవడం కోసం బ్యాంకుల చుట్టూ లోన్ కోసం తిరుగుతాడు రాకీ. ఆ సమయంలో డ్రైవింగ్ నేర్చుకోవడానికి వచ్చిన మాయ (శ్రద్ధా శ్రీనాథ్)కు రాకీ సమస్య తెలిసి ఎటువంటి సాయం చేసింది? రాకీ జీవితంలోకి మళ్ళీ ప్రియా రావడం వల్ల ఎటువంటి మార్పు చోటు చేసుకుంది? గ్యారేజ్ కాపాడుకున్నాడా? లేదా? అందుకు రాకీ ఇంకేం చేశాడు? అతని జీవితంలో గ్యారేజ్ మించిన సమస్యలు ఏమున్నాయి? చివరకు ఎలా సాల్వ్ చేశాడు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ :** స్క్రీన్ ప్లే, అందులో భాగంగా వచ్చే ట్విస్ట్ ఏదైనా సరే... ప్రేక్షకుల ఊహకు అందనంత వరకు షాక్ మూమెంట్ / వావ్ ఫ్యాక్టర్ ఇస్తాయి. ట్విస్ట్ రివీల్ కావడానికి ముందు ఊహిస్తే... స్క్రీన్ ముందు సినిమా చూసే ప్రేక్షకుడికి మజా ఉండదు. 'మెకానిక్ రాకీ'లో వావ్ ఫ్యాక్టర్ మిస్ అయ్యింది. ముందు ముందు జరిగేది తెలిసేలా ఉండటంతో మజా పోయింది.

'మెకానిక్ రాకీ' టీజర్, పాటలు, ట్రైలర్లు చూస్తే పక్కా కమర్షియల్ సినిమా ప్రేక్షకులు ఓ అంచనాకు వచ్చే అవకాశాలు ఎక్కువ. అయితే... ఆ అంచనాలు తప్పు అని, అంతకు మించి అనేటటువంటి కథ సినిమాలో ఉంది. అది ప్లస్సే. కానీ, అసలు కథలోకి వెళ్లేటప్పుడు, ఒక్కో ట్విస్ట్ రివీల్ కావడానికి ముందు ఊహించేలా ఉండటం పెద్ద మైనస్. దానికి తోడు అవుట్ డేటెడ్ స్క్రీన్ ప్లే, కమర్షియల్ హంగులు కామన్ ఆడియన్ అటెన్షన్ డైవర్ట్ చేస్తాయి.

'మెకానిక్ రాకీ' ఫస్టాఫ్‌లో కథ కొంచెం కూడా ముందుకు వెళ్లదు. పోనీ ఫుల్లుగా ఎంటర్‌టైన్ చేసిందా అంటే అదీ లేదు. తండ్రితో తిట్లు తినే కొడుకు, కాలేజీలో ప్రేమ కథ – కామెడీ, ఆ విలన్ ట్రాక్... ఇప్పటికే వందల సినిమాల్లో చూసిన కథను కొత్త డైలాగులతో మళ్లీ చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. ఇంటర్వెల్ తర్వాత గానీ అసలు కథలోకి వెళ్లలేదు. తండ్రి పాత్రను ముందుగా మనకు చూపించడంతో క్లైమ్యాక్స్‌లో కిక్ మిస్ అవుతాం. కొంతలో కొంత శ్రద్ధా శ్రీనాథ్ క్యారెక్టర్ ట్విస్ట్ వర్కవుట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఛేజ్ సీక్వెన్సులు బాగా తీశారు. కామెడీ కొన్ని సన్నివేశాల్లో బావుందంతే! సినిమాటోగ్రఫీ, మ్యూజిక్, ఎడిటింగ్, ప్రొడక్షన్ వేల్యూస్... కమర్షియల్ సినిమాకు తగ్గట్టు ఉన్నాయి తప్పు నోటీస్ చేసేలా లేవు. పాటలు కథకు అడ్డు తగిలాయి. కొత్త దర్శకుడు రవితేజ ముళ్ళపూడి కథ తమిళ్ బ్లాక్ బస్టర్ సినిమాను గుర్తు చేసేలా ఉంది.



విశ్వక్ సేన్ ఎప్పటిలా హుషారుగా నటించారు. ఫైటుల్లో అగ్రెషన్ చూపించారు. పంచ్ డైలాగ్స్ తనదైన శైలిలో చెప్పారు. కథలో మంచి కోర్ పాయింట్ ఉండేలా చూసుకోవడంలో సక్సెస్ అయ్యారు. కానీ, అది కరెక్టుగా ఎగ్జిక్యూట్ అవుతుందా? స్క్రీన్ ప్లే బావుందా? లేదా? అనేది చూసుకోవడంలో సక్సెస్ కాలేదు. విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి పెయిర్ ఓకే. కానీ ఇద్దరి మధ్య లవ్ / ఎమోషనల్ ట్రాక్ అంతగా వర్కవుట్ కాలేదు. మీనాక్షి నటన ఓకే.

ఇంటర్వెల్ వరకు శ్రద్ధా శ్రీనాథ్ ఒకలా ఉంటే, ఆ తర్వాత రివీల్ అయ్యే ట్విస్టుల వల్ల మరోలా ఉంటుంది. యాక్టింగ్ ఓకే కానీ ఆ మేకోవర్ (ముఖ్యంగా బేబీ హెయిర్ కట్ విగ్, మేకప్) ఆమెకు సెట్ కాలేదు.

నరేష్, హర్ష చెముడు, హర్షవర్ధన్, 'హైపర్' ఆది కొన్ని సన్నివేశాల్లో నవ్వించారు. '35 చిన్న కథ కాదు' ఫేమ్ విశ్వదేవ్ రాచకొండ కీలకమైన క్యారెక్టర్ చేశారు. రోడీస్ రఘు రోల్ రెగ్యులర్‌గా ఉంది. సునీల్ స్క్రీన్ స్పేస్ తక్కువ. ఉన్నంతలో న్యాయం చేశారు. మిగతా నటీనటులు గుర్తుంచుకునే క్యారెక్టర్లు చేయలేదు.

'మెకానిక్ రాకీ'లో విషయం ఉంది. సామాన్యులు చాలా మంది ఘరానా కేటుగాళ్ల చేతిలో ఎలా మోసపోతున్నారు అనేది చెప్పారు. అయితే... అసలు కథ వచ్చేసరికి ఆలస్యం అయ్యింది. అప్పటి వరకు రొటీన్ కమర్షియల్ సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది. టూమచ్ రొటీన్ ఫస్టాఫ్‌తో కంపేర్ చేస్తే సెకండాఫ్ బెటర్. ఇంటర్వెల్ తర్వాత కూడా ట్విస్టులను మరింత బాగా ఎగ్జిక్యూట్ చేయాల్సింది. కామెడీ కొంత వర్కవుట్ కావడం థియేటర్లకు వెళ్లిన ప్రేక్షకులకు ఊరట. ఫైనల్‌గా డిజప్పాయింట్ చేసింది దాసు!

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది
చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి
గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H.
NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

### పండిత, పామరుల చెవులూరించిన వయోలిన్ విద్వాంసుడు, ఆదర్శగురువు

# 'సంగీతానంద' శ్రీ నేతి శ్రీరామశర్మ



**(గతవారం తరువాయి)**

అదే సందర్భములో రైల్వే సమ్మె కారణంగా జయరామన్ గారు ఒక వారం రోజులపాటు విజయవాడలోనే బస చేయవలసి వచ్చినది. ఈ వారంరోజులు వారితో గడిపిన సమయములో "శర్మగారిలోని మంచి గుణాలు, వారి స్నేహపూర్వక స్వభావం, వినయం, చిత్తశుద్ధి మరియు సంగీతం పట్ల వారికి ఉన్న అంకితభావం వెలుగులోకి రావడమే కాకుండా మా స్నేహాన్ని మరింత దగ్గర చేసిందని" అని అన్నారు శ్రీ జయరామన్ గారు. తరువాతి కాలంలో కూడా చాలా సందర్భాలలో వారివురు ఆంధ్రాలో అనేక నగరాల్లో కలుసుకున్న ప్పుడు శ్రీ జయరామన్ గారు "శర్మలో అప్పటికి ఇప్పటికి మార్పులేదని, అంతటా అలాగే ఉన్నాడని" కొనియాడారు.

శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు గారు, వాయులీన విద్వాంసులు "శ్రీరామశర్మ గాత్రము, వయోలిన్ వాయిద్యములందు అగ్రగణ్యుడనిబీ అయన పాట పాడినా, వయోలిన్ తనిగా వాయించినా, ప్రక్క వాయిద్యముగా వాయించినా తనదంటూ ఒక ప్రత్యేకత సంతరించుకున్న మహామనీషియనిబీ సంగీత కళను భక్తితో ఆరాధించి సంగీత కళామతల్లికి యెనలేని సేవచేసిన మహావ్యక్తి, వయోలిన్ ప్రక్క వాయిద్యముతో సహకరించినప్పుడు తన నిండు హృదయముతో పాటకులను ఉత్సాహముగా పాడించి, అటు పాటకులను, ఇటు రసికులను రంజింపగల సమర్ధులని" కొనియాడారు.

'సంగీత ప్రచార సేవకారత్న' శ్రీ కె. ఎస్. ఆర్. బాలకృష్ణ శాస్త్రిగారు (అధ్యక్షులు: సప్తస్వర, హైదరాబాదు) తమ సందేశములో "శ్రీ శర్మగారు ఆకాశవాణి నిలయ విద్వాంసునిగా బాలానందం కార్యక్రమము మొదలుకొని మాములు కరాళాకారులకు, హరికథా విద్వాంసులకు, ప్రఖ్యాత విద్వాంసులు పాడే కచేరీలకు, రాగం తానం పల్లవి కార్యక్రమములకు వయోలిన్ సహకారం అందించడానికి ముందుండేవారనిబీ కళాకారునియొక్క మనసునెఱంగి ప్రక్క వాయిద్యం వాయించడం, మంచి మనసుతో ఇతరులకు పరిచయం చేయటం వారిలో గల విజ్ఞత అనిబీ కాలమును సద్వినియోగం చేయడం వారి నైజమనిబీ అనేకమందికి అనేక విధములుగా సహాయంచేసిన వ్యక్తియని, సంగీతలోకంలో వారి సహాయములేని కార్యక్రమాలు ఏవీ లేవనిబీ గురువులు పారుపల్లి వారివలెనే శిష్యవాత్సల్యంతో అనేకమంది శిష్యులకుసంగీత భిక్షపెట్టి ఆదర్శ గురువులుగా పేరుపొందారనిబీ ఛలోక్తులు చెప్తూ అందరినీ నవ్విస్తూ ఉండేవారనిబీ కొంతమంది కాళాకారులు శర్మగారి ఛలోక్తులు ఔషధంగా సేవించి ఉత్సాహవంతులయ్యేవారనిబీ ఉభయ తెలుగు రాష్ట్రములలోనే కాకుండా బెంగాల్ రాష్ట్రములో,దక్షిణాదిరాష్ట్రములలో, కేంద్రపాలితమైన ఢిల్లీలోనూ అనేక సంగీత సభలు చేసి సన్మానాలు పొందారనిబీ శర్మగారికి జరిగిన అఖండ సన్మానములు కొంతమంది మహానుభావులకే జరిగినాయని" తెలియచేసారు.

శ్రీ సూరి వెంకటేశ్వర్లు గారు (అధ్యక్షులు: విజ్ఞాన సమితి, హైదరాబాదు) శ్రీరామశర్మ గారిని ప్రశంసిస్తూ "వీరు కర్ణాటక సంగీతంలో ప్రముఖ విద్వాంసులందరికీ వయోలిన్ సహకారాన్ని అందించేవారనిబీ చిన్న పెద్ద అనే తేడా లేకుండా సంగీత విద్వాంసుల యెడ గౌరవం, ప్రేమ, అభిమానం, వాత్సల్యం చూపి అందరి మన్ననలు పొందారనిబీ ఉన్నతశ్రేణి 'ఏ గ్రేడ్' విద్వాంసుడనని గిరిగీసుకొని కూర్చోలేదనిబీ తాను నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ హాయిగా జీవనం సాగించిన ధన్యజీవి, సద్గురువు, అజాతశత్రువు, వినయశీలి, నిగర్వి, నిరాడంబరుడు, నిష్కపటి అని సాటి కళాకారులు అంటూ ఉండేవారనిబీ 84 ఏళ్ళ జీవితం అంతా సంగీతంలోనే ఆనందంగా గడిచిపోయిందని, అందుకే 'సంగీతానంద' బిరుదు వీరికి సార్ధకమైనదనిబీ జంత్ర గాత్ర విద్వాంసులుగా ప్రసిద్ధిపొందారనిబీ ఆకాశవాణి హైదరాబాదు కేంద్రములో నాలుగు దశాబ్దములపాటు నిర్విరామంగా వయోలిన్, గాత్రంలో తమ బాణిని, వాణిని వినిపించారనిబీ శర్మగారిని ఎప్పుడు కలిసినా ఉల్లాసంగా, ఉత్సాహంగా, సంతోషంగా గడిచిపోతుందనిబీ వీరికి శిష్యులంటే ఎంత ప్రేమో ఆ శిష్యులకు గూడా గురువుగారంటే అంత భక్తి, గౌరవమనిబీ విజ్ఞాన సమితి నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలలో వీరు ఎప్పుడూ ముఖ్య అతిధియనిబీ ఆకాశవాణిలో వీరిని బహుముఖ ప్రజ్ఞాశాలిగా అందరూ మెచ్చుకుండేవారనిబీవారి సాంగత్యం మరువలేనిది, మరపురానిదని" కొనియాడారు.

శ్రీ వెంకటేశ్వర్లు గారు ఒకసారి శర్మగారిని కలవటానికి 'ఆకాశవాణి' కి వెళ్లారుట. విరామ సమయం కావటం వల్ల కాంటీన్ లో ఉన్నారని తెలిసి అక్కడకు వెళ్లారు. అప్పుడు శర్మగారు తమ మిత్రులతో కూర్చుని 'టీ' ఆర్డర్ చెపితే – 'టీ' ఇచ్చే కుర్రాడు 'షుగరు వెయ్యాలా' అని అడిగితే – శర్మగారు వెంటనే 'మా వంట్లో చాలా షుగర్ వుంది, నువ్వు వెయ్యక్కర్లేదు" అన్నారుట. అంతే! ఆ వాతావరణం అంతా నవ్వుల మయమయ్యిందనిబీ వారి సాంగత్యం మరువలేనిది, మరపురానిదని జ్ఞప్తికి తెచ్చుకున్నారు వెంకటేశ్వర్లు గారు.

హైదరాబాద్ సిస్టర్స్ శ్రీమతి లలిత, శ్రీమతి హరిప్రియలు "శర్మగారిలో మాకు నచ్చినది ఏమిటంటే–తల్లీ, తండ్రి, గురువు జీవితములో ఎంత ముఖ్యమో, వారిని ఎంత భక్తితో భావించాలో చెపుతుండేవారనిబీ వారు మంచి ఉపాధ్యాయులని, మేము కూడా వారి దగ్గర ఎన్నో మంచి అంశాలను ఆకళింపు చేసుకొని మా సంగీతంలో ఇముడ్చుకొని పాడుకొనేవాళ్లమనిబీ వారు స్వతహాగా చాలా చురుకు మనిషియని, సంగీతం మీద అంకిత భావముతో ఉండేవారని, వారు ఎల్లప్పుడూ చిరస్మరణీయులని" కొనియాడారు.

శ్రీ పి. వి. రామమోహన్‌నాయుడు గారు తమ సందేశములో వీరి వద్ద తర్ఫీదు పొంది ఆకాశవాణిపోటీలలో అవార్డులు, బహుమతులు అందుకున్న యువతీయువకులు ఎందరో ఉన్నారని, బీద విద్యార్థులకు గుప్తదానాలు చేసిన మంచి మనిషియని , ఔదార్యం ప్రదర్శించవలసిన సమయాల్లో ముందుండటానికి వారు ఎప్పుడూ వెనుకాడేవారు కారని, గతకాలపు సుస్వరానికీ, సంగీత కళావైభవానికీ ఆనవాళ్లుగా నిలిచిన అతికొద్దిమందిలో ఒకరనిబీ సంగీతమే తన ఊపిరిగా, అదొక్కటే తన మార్గంగా భావించి నడిచారనిబీ సాధారణంగా కనిపించే ఈ అసాధారణ ప్రజ్ఞావంతుడి సేవలు తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలు వినియోగించుకుంటే మరోతరం కళాకారులను మెరికల్లా తయారుచేసే అవకాశం ఉంటుందని" కొనియాడారు.

శ్రీరామశర్మ శిష్యగణంలోని నేమాని పార్ధసారధి గురువుల గురించి ప్రస్తావిస్తూ "కర్ణాటక సంగీతానికి జీవితాన్ని పూర్తిగా అంకితం చేసిన మాహానుభావులనిబీ పారుపల్లి వారి శిష్యునిగా శ్రీ బాలమురళి, శ్రీ అన్నవరపు రామస్వామి గారి వంటి సంగీత ఘనాపాఠీల సమకాలీకునిగా వారు సంగీతానికి చేసిన సేవలు అజరామరమని, అనన్య సామాన్యమనీబీ తన దగ్గర ఉన్న సంగీత కళానిధిని భావితరములవారికి అందించాలన్న సదుద్దేశ్యముతో వందలాది మంది శిష్యులకు కొన్ని దశాబ్దములపాటు చేసిన విద్యాదానం మరువలేని దనిబీ ఆలా వారి దగ్గర శిష్యరికం చేసిన వారిలో తాను కూడా ఉండటం తన పూర్వజన్మ సుకృతమనిబీ 'సద్గురువు' అనే పదానికి అచ్చమైన నిదర్శనం శ్రీ శర్మగారనిబీ శ్రీమతి ఎమ్. ఎస్. సుబ్బలక్ష్మి వారివంటి సంగీత శ్రేష్ఠులకు వాయిద్య సహకారం అందిస్తూ ఎంత ఆనందించేవారో .. గీతాలు పాడుతున్న ఒక చిన్నపిల్లవానికి వాయించడం కూడా అంతే విధముగా ఆస్వాదించేవారని, అది నేతివారి సంస్కారమని" సగర్వంగా తెలియచేసారు. అంతే కాకుండా 1992 సంవత్సరంలో ఆకాశవాణిలో లలిత సంగీతంలో తనకు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రావటానికి, మరిన్నో రకాలుగా గుర్తింపు పొందటానికి ఆ మాహానుభావుడే కారణమనియుబీ శిష్యులు యువవాణి సంగీత కార్యక్రములలో పాల్గొనటానికి, ఇతర సంగీత పోటీలకు వెళ్ళటానికి గురువుగారే స్వయముగా దరఖాస్తులు నింపి, వారి మోటారు సైకిల్ మీద తీసుకెళ్లి, శిష్యులు బాగా పాడి గుర్తింపు తెచ్చుకోవడానికి దోహదపడిన మహోన్నత వ్యక్తిత్వం గురువుల సొంతమనిబీ గురువులు పెట్టిన 'సంగీత బిక్ష' వల్ల ఇవాళ తాను సినీ సంగీత పరిశ్రమలో ఒక నేపధ్య గాయకుడిగా అందరి మన్ననలు పొందడానికి తన జీవనయానంలో ఉపయోగపడుతోందనిబీ అంతటి సద్గురువు వద్ద శిష్యరికం చేసే మహద్భాగ్యాన్ని కలిగించిన ఆ 'సర్వేశ్వరునికి' శతసహస్ర వందనాలర్పిస్తున్నాని .. పార్ధసారధి గురువులైన నేతివారిని తలచుకున్నారు.

శర్మగారి సీనియర్ శిష్యురాలు, చైర్పర్సన్ ఆంధ్ర మహిళా సభ ఫైన్ ఆర్ట్స్, (హైదరాబాద్) డాక్టర్ వై. రమాప్రభ గారు తమ గురువులను తలచుకుంటూ "పారుపల్లి వారి ఆశయాలను నూటికి నూరుపాళ్ళు అమలుపరచి సంగీతాన్ని ఆనందింపచేస్తూ బోధన చేసిన సద్గురువులనిబీ పిళ్ళారి గీతం పాడినా, రామదాసు కీర్తన పాడినా నవ్వుతూ శిష్యులకు వారే వయోలిన్ సహకారాన్ని అందించిన మహనీయులని, ఈ విషయాన్నీ జ్ఞాపకం చేసుకుంటే ఎవరికైనా కళ్ళు చెమర్చక మానవని" గుర్తుచేసుకొన్నారు. గురువుగారిలో అద్భుతమైన గుణము ఒకటుందని, ఎవరైనా పెద్ద పెద్ద విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, అన్నవరపు రామస్వామి, మహాదేవు రాధాకృష్ణరాజు, నూకల చిన సత్యనారాయణ, ఎన్.ఎస్. శ్రీనివాసన్, శ్రీరంగం గోపాలరత్నం, జయలక్ష్మి సంతానం, మాలతీ పద్మనాభరావు, పాకాల సావిత్రి, ఎల్లా వెంకటేశ్వరరావు, కొక్కొండ సుబ్రహ్మణ్య శర్మ, ఆకెళ్ళ మల్లికార్జున శర్మ ప్రభృతులు గురువుల ఇంటికి వచ్చినప్పుడు ఆ సమయంలో పాఠం నేర్చుకుంటున్న శిష్యగణాన్ని పరిచయము చేస్తుంటే శిష్యులము మహాద్భాగ్యంగా భావించేవారమనిబీ సభా నిర్వాకులు సర్వశ్రీ కొణికి సత్యనారాయణ, వి. ముక్తేశ్వరరావు లాంటి పెద్దలు గురువుల ఇంటికి వచ్చినప్పుడు శిష్యులను పరిచయం చేసి వీళ్ళు చక్కగా పాడతారు ముందు ఒక గంట అవకాశం ఇచ్చి చూడమనేవారని, ఇటువంటి విశాలహృదయం గల గురువులు దొరుకుట చాలా అరుదు మరియు మా అదృష్టమని కూడా అంటారు. మా గురువులు వేసిన ఆ బీజాలే మొలకెత్తి, మొక్కలై, వృక్షాలై శాఖోపశాఖులుగా విస్తరించి సంగీతానికి కొద్దో గొప్పో సేవచేసే భాగ్యం మాకు దక్కిందని, గురువులకు 2000 సం. లో శిష్యగణమంతా డాక్టర్ బాలమురళీకృష్ణ గారి ఆధ్వర్యంలో జరిపిన సువర్ణాఘంటా కంకణ – కనకాభిషేక మహోత్సవము, 'సంగీతానంద' బిరుదు ప్రదానము హైదరాబాదు నగరంలో నభూతొ న భవిష్యతియని, గురువుల ఆసిస్సులు మాకు ఎల్లయెడల ఉండాలని ఆశిస్తున్నామని అన్నారు.

దేశము నలుమూలలోని పలు సంగీత సభలవారు శ్రీరామశర్మ గారిని ఆహ్వానించారు మరియు ఘన సన్మానాలు, సత్కారాలు చేసి ఆదరించారు. వారిని సన్మానించిన కొన్ని ప్రతిష్ఠాత్మకమైన సభలు, సంస్థలు ం 1970 లో కలకత్తా ఆంధ్ర సంఘం, కలకత్తాబీ కళారాజ్యం (రిజి.), హైదరాబాదుబీ శ్రీ తూము నరసింహదాసు ట్రస్ట్, హైదరాబాదుబీ శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాదుబీ విజ్ఞాన సమితి, హైదరాబాదుబీ కిన్నెర ఆర్ట్స్, హైదరాబాద్‌బీ కూచిపూడి ఆర్ట్స్ అకాడెమి బీ వైష్ణవి అకాడమీ అఫ్ ఫైన్ ఆర్ట్సుబీ 2005 సంవత్సరానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ వారిచే 'ప్రతిభా పురస్కారం'బీ 2007 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే 'ప్రతిభా రాజీవ్ పురస్కారం'బీ 2010 సంవత్సరం లో 'శ్రీ కృష్ణమాచార్య కళాపీఠం' , విజయవాడబీ 2010 లో విశాఖ మ్యూజిక్ అకాడెమి వారిచే 'ద్వారం వెంకటస్వామి నాయుడు' గారి స్మారక పురస్కారం.

అనేక సంగీత సభలకు భూరి విరాళములందించి కచేరీలు నిర్వహించటానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వడంతోపాటు వారే స్వయంగా తమ గురువులు శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి పేరిట 1997లో సంస్థను స్థాపించి జీవిత చరమాంకం వరకు ప్రతీ సంవత్సరం కచేరీలు నిర్వహించి ఎంతోమంది శిష్యులకు అందులో పాల్గొనే అవకాశం కల్పించారు. హైదరాబాదు మహానగరంలో ఏ సంగీత కళాకారుడైన శ్రీరామశర్మ మాస్టారు గారి శిష్యులో, ప్రశిష్యులో అయిఉంటారనటంలో అతిశయోక్తిలేదు.

సుమారు మూడు దశాబ్దములకు పైగా హైదరాబాదు ఆకాశవాణిలో నిలయ విద్వాంసునిగా సేవలందించి, 1988లో సీనియర్ నిలయ విద్వాంసునిగా పదవీవిరమణ చేసి, స్థానికంగా స్థిరనివాసం ఏర్పరుచుకుని ఆరుగురు సంతానానికి వివాహములు చేసి జీవితంలో స్థిరపడి, సంగీతమే తన ఊపిరిగా, జీవన పరమార్గంగా, సర్వస్వముగా భావించి జీవన ప్రయాణం చేసి, ఎంతోమంది శిష్యగణాన్ని తయారుచేసి వారిని ఉత్తములుగా వృద్ధిలోకి తీసుకువచ్చి తరించిన ధన్యజీవి 'సంగీతానంద' శ్రీ నేతి శ్రీరామశర్మ గారు వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినాన (తేదీ: మే 2, 2012) శ్రీరామసాయుజ్యానికి చేరి సంగీతాభిమానులందరి మనస్సులలో 'చిరస్మరణీయుడు' గా నిలిచిన మహర్షి.

గురువుల నిర్యాణం పిదప జరిపిన గురుసంస్మరణ సభ సందర్భాన 2012లో శిష్య ప్రశిష్య బృందం సుప్రసిద్ధ వాయులీన విద్వాంసురాలు కుమారి %ూ%. కన్యాకుమారి గారిని సన్మానించగాబీ తరువాతి కాలంలో 2013 నుండి ఆంధ్ర మహిళా సభ ఫైన్ ఆర్ట్స్ వారి సౌజన్యంతో, ప్రత్యేకించి శిష్య పరమాణువు పి. రమేష్ మరియు ఇతరులు ఏర్పరచిన మూలనిధితో శిష్యగణం గురువుల జయంతిని 'గురుస్మరణం' పేరిట ప్రతీ సంవత్సరం నిర్విఘ్నముగా జరిపి ఒక ప్రముఖ సంగీత విద్వాంసుని ఘనంగా సన్మానిస్తూ ఉండటం ఎంతో ముదావహం, హర్షణీయం. 2023 సంవత్సరానికి గాను పద్మశ్రీ శ్రీ అన్నవరపు రామస్వామి గారిని ఘనంగా సన్మానించారు.

**'శ్రీరామ జయం' 'జై సీతారామ్'**



**– యనమండ్ర వేంకట కృష్ణయ్య**
**9849986679**

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత, జ్యోతిష్య చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 1.12.2024 నుంచి 7.12.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలోఖర్చులు ఊహించిన దానికన్నా ఎక్కువగా ఉంటాయిఆరోగ్యపరమైన విషయాలలో వ్యక్తిగత శ్రద్ధ అవసరము.మానసిక ప్రశాంతత తక్కువగాఉంటుందిఉద్వేగాలను,కఠినమైనమాటలనుకోపాన్నినియంత్రించుకోవాలికుటుంబ సంబంధమైన ప్రయాణములు, భాగస్వామ్య వ్యవహారాలలో అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి. విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. కమ్యూనికేషన్ బాగుంటుంది. జ్ఞాపక శక్తిని పెంచుకునే విధంగా కృషి చేస్తారు. వ్రాత నైపుణ్యాలు బాగుంటాయి. కొత్త పెట్టుబడుల గురించి ఆలోచన చేస్తారు.విద్యార్థులకు విద్యాపరమైన ప్రయాణాలకు అవకాశం ఉంది. ఇంటిలోని పెద్దలతో అభిప్రాయబేధాలు రాకుండా జాగ్రత్త్తగావ్యవహరించాలి. వ్యాధినిరోధక శక్తిపెరిగి, శత్రువుల పవిజయంసాధించి, పూర్వపు రుణములను చెల్లిస్తారు



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారంప్రారంభంలోరాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యక్తులు ఉన్నత అధికారులు సలహా సంప్రదింపులతో కొంత కా లముగా ఆగి ఉన్న పనులను మొదలుపెడతారు. ఆత్మీయులసహకారముతోడ్పడుతూఅనుకున్నపనులుసాధించుకుంటారు. నిర్ణయి సామర్థ్యం బాగుంటుంది పరాక్రమం పెరుగుతుంది. సంతృప్తి పెరుగుతుంది.చమత్కారంగా మాట్లాడతారు వ్యాధినిరోధకశక్తిపెరుగుతుంది. .విద్యార్థులకు అనుకూలంగాఉంటుంది,కానీవిద్యపట్లశ్రద్ధపెంచుకోవాలి. సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూపనులు సాధించుకుంటారు. బంధువుల్ని,ప్రియమైనవ్యక్తుల్నికలుస్తారు.విందువినోదలోపాల్గొంటారు.సంతానమునకుఅభివృద్ధి,ఆత్మీయులు సహకరిస్తారు ఉద్వేగములుఅధికంగాఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ముందుకుసాగుతాయి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోఖర్చులు మాత్రమే కాకుండా ఆరోగ్య విషయంలోకూడాకొంతశ్రద్ధతీసుకోవాలి.వాగ్దానంనిలబెట్టుకోవడంకొంతవరకుకష్టంఅవుతుంది.ధనవిషయంలోఆటంకాలు. శక్తికిమించినఖర్చులు.కుటుంబంలోమీ ఆధిపత్యం పెరుగుతుంది. వృత్తిపరమైన అధిక శ్రమతో నిద్రలేమి ఇబ్బంది పెడుతుంది.నూతన శక్తితో మనసు ఉత్సాహంగా కొత్త నిర్ణయాలుకొరకుఆలోచనలుచేస్తుంది.విందువినోదాల్లోఖర్చులుఅధికము .శారీరక శ్రద్ధ,వ్యాయామప్రాణయమాలుచేస్తారు .గౌరవముకీర్తిపెరుగుతుంది.సంఘంలోగుర్తింపు,కుటుంబంతో,మిత్రులతోకలిసిసమయాన్నిసద్వినియోగపరచుకుంటారు తోబుట్టులతోఅభిప్రాయబేధాలురాకుండాజాగ్రత్తగావ్యవహరించాలి.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోమాట్లాడే మాటల వల్ల అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త పడాలి. కంటికి సంబంధించిన విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఉన్నత విద్య కోసం చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. గృహ, వాహన పరమైన లాభాలు..వృత్తిపరమైన అభివృద్ధి,సోదరిసహకారం, కమ్యూనికేషన్ బాగుంటుంది. వాహన సంబంధ అంశాలలో కొన్ని ఆటంకాలు. ప్రయాణం లాభిస్తాయి కుటుంబ పరమైన విషయాల్లో, బంధువుల కొరకు ఖర్చులు చేస్తారు శిరోవేదన శారీరక శ్రమ నిద్రలేమి, కొంత ఇబ్బంది ని కలిగిస్తాయి ఆరోగ్య పట్ల శ్రద్ధ పెంచడం మేలు. తల్లితండ్రుల సహకారం నిర్ణయాలు తీసుకుంటారు. ఉన్నత అధికారుల సహకారంతో అనుకున్నపనులుఅనుకున్నసమయాన్నిపూర్తిచేస్తారు.. పౌరుషంగా నిర్ణయాలు తీసుకుంటారు



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంగురువుల ఆశీస్సులు లభిస్తాయి ఆకస్మిక వైరాగ్యం ప్రశాంతత తగ్గిస్తుంది.సంతానం వృద్ధి పరంగా ముందుకు సాగుతారు. మీ ఆలోచన విధానం బాగుంటుంది నిర్ణయసామర్థ్యంపెరుగుతుందిఉద్వేగాలకు లోనై కుటుంబ సంబంధమైన ముఖ్యమైన కార్యక్రమాల లో ఇబ్బందులకు గురవుతారు. ఆ విషయంలో జాగ్రత్త అవసరము. చివరికి వాటన్నిటిని అధిగమిస్తూ కుటుంబకార్యక్రమాల్లో పాల్గొంటారు ఆరోగ్య విషయంలో, ముఖ్యంగా సంతానము యొక్క కంటి ఆరోగ్య శ్రద్ధ అవసరము, ఇష్టమైన కార్యక్రమాల్ని నిర్వహిస్తారు,గవర్నమెంట్ ఉద్యోగులతో విభేదాలు రాకుండా జాగ్రత్తవహించాలి.కుటుంబంలోవాతావరణంఅనుకూలంగా ఉంటుంది.నూతన నిర్మాణాల కొరకు ఆలోచన అధికం చేస్తారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

ప్రారంభంలోవృత్తిపరమైనఅంశాలుఅనుకూలంగాఉంటాయి వ్యాపారపరమైనఅంశాలలోజాగ్రత్తలుతీసుకోవాలి.తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. భాగస్వామితో కలిసి కుటుంబ పరమైన ప్రయాణాలు ఇబ్బంది పడకుండా జాగ్రత్త వహించాలి. .వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ అవసరము.దూర ప్రదేశంలో ఉండే వ్యక్తులతో మాట్లాడేటప్పుడు జగడములు రాకుండా జాగ్రత్తలుతీసుకోవాలిదూర ప్రదేశాలలో ఉన్నత విద్య కొరకుప్రయత్నంచేసేవిద్యార్థులకుఅధికశ్రమతోకొంతవరకుఅనుకూలంగాఉంటుందినూతనబాధ్యతలుపెరుగుతాయిశ్రమపెరుగుతుంది..సంతానానికిఅభివృద్ధిపరంగాఉంటుందినూతనపెట్టుబడులుకొరకుఆలోచనలుచేస్తారు.విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంచుకోవాలి చదువు పై శ్రద్ధ అవసరం ఇతరులతో శత్రుత్వములు రాకుండా వ్యవహరించాలి.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వారసత్వపు ఆస్తి లచర్చలమీద, భూమికిసంబంధించినఅంశాలపట్లశ్రద్ధతీసుకుంటారుమీఆరోగ్యవిషయంలో,రహస్యశత్రువులఅంశాలలో కొత్త ఘర్షణఉంటుంది.వృత్తిపరంగాఅనుకూలంగాఉంటుందిఉన్నతాధికారులు సహకరిస్తారు కొత్త బాధ్యతలు అప్పచెప్తారుతోబుట్టువులతో అభిప్రాయ బేధములు రాకుండా జాగ్రత్త తీసుకోవాలిదూర ప్రదేశములలో ఉండే వ్యక్తుల సహకారంతో పనుల కోసం ప్రణాళికలు ఏర్పరచుకుంటారు.. గృహ సంబంధ అంశాల కొరకు వాహన మార్పుల కొరకు ఆలోచన చేస్తారు. సంబంధం లేని వ్యక్తుల జోక్యం దూర ప్రదేశాల్లో ఉండే వారి సలహాల వచ్చే ఆటంకాలు చికాకులు కలిగిస్తాయి వృత్తిపరమైన అభివృద్ధి కొంత శ్రమను తగ్గిస్తుంది. భాగస్వామి ఆరోగ్య శ్రద్ధ అవసరము. వ



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోదీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలోనూ, ఇష్టమైన వ్యక్తులతో అభిప్రాయ బేధాలు, ఘర్షణలు రాకుండా జాగ్రత్త వహించాలి.సంఘాల్లో వ్యాపార రంగంలో అనుభవం ఉన్న నూతన వ్యక్తుల పరిచయాలు. చేస్తున్న పనుల పట్ల అసంతృప్తిఆటంకాలు.క్రిందపనిచేసేవ్యక్తులసహకారాన్నికోరుకుంటారుసమయానికివారుఅందించటంవల్లముఖ్యమైనపనులుకొంతవరకుముందుకుసాగుతాయ.ఉన్నత విద్య కోసం ప్రయత్నం చేసే విద్యార్థులకు అధిక శ్రమ. భాగస్వామికి సంబంధించిన వృత్తిపరమైన విషయాలలో, ఆదాయ అంశాలలో ఆకస్మిక మార్పులు. వివాహ సంబంధమైన అంశాలలో తొందరపాటు నిర్ణయాలు తగవు.వృత్తిపరమైనవిషయాలలో కొంత నిరాశక్తత, అధిక శ్రమ. తండ్రితో చర్చించి నెమ్మదిగా నిర్ణయాలుతీసుకోవడంకొంతవరకుమంచిది. రావలసిన లాభాలు వాయిదా పడటం వల్ల చికాకులు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలోనూతన వృత్తులకు అవకాశాలు లభిస్తుందిసంఘములోగౌరవంకీర్తిప్రతిష్టలునూతనపరిచయాలు, భాగస్వామికి గౌరవం.రుణాలు చెల్లిస్తారుఆగిపోయిన పనులు ముందుకు పెడతాయి. ఇతర సహకారంతో అనుకున్న పనులను పెద్ద శ్రమ లేకుండాసాధించుకుంటారు. శ్రమకు తగిన సన్మానాలు పొందుతారు.మీ శక్తి మీద మీకు నమ్మకం పెరుగుతుందిరోగ నిరోధక శక్తితో పాటు శత్రువులపై విజయం సాధిస్తారు. లఉన్నత అధికారులతో, ప్రభుత్వ రంగంలో ఉండే వ్యక్తులతో నిదానంగా వ్యవహరించి పనులు ముందుకు తీసుకువెళ్లాలి. గౌరవం తగ్గకుండా చూసుకోండి. ముఖ్యమైన పనులలో ఆటంకాలు మానసిక ఒత్తిడిని పెంచుతాయి.ఆకస్మికమైన ఖర్చులు మాట నిలబెట్టుకోలేని వాగ్దానాలు ఇబ్బందుల గురిచేస్తాయి



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారంప్రారంభంలోపట్టుదలగావ్యవహరించిమిత్రులసహకారంతో,మీనైపుణ్యమైనకమ్యూనికేషన్తోసాధించుకుంటారు. . దీర్ఘకాలిక అనారోగ్యాల విషయంలో శ్రద్ధ అవసరం. విద్యార్థులకు ఉన్నత విద్య, మీ ఆధ్యాత్మిక విషయాలలో కొంత వరకు ముందుకుపెడతాయిసంతాన అభివృద్ధి పరంగా ముందుకు వెళుతుంది. సంఘంలో గుర్తింపు గౌరవం నూతన పరిచయాలు ఏర్పడతాయి.నూతన వృత్తి కొరకు చేయు ప్రయత్నాలు,ఆగిన పనులు ముందుకు వెళతాయి. ఆరోగ్యం బాగుంటుంది. తోబుట్టువులు విషయాలు, వృత్తి సంబంధించిన ఆలోచనలు ప్రశాంతతనుతగ్గిస్తాయి. వ్యక్తుల వల్ల అవమానములకు గురి కాకుండా మీ మాటలలో వీలైనంత జాగ్రత్తలు తీసుకోవాలి. అభిప్రాయ భేదాలు రాకుండా జాగ్రత్తగా ఉండాలి



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో భాగస్వామి సంబంధ ఆత్మీయుల రాకపోకలు, సంతాన సంబంధం నూతన పెట్టుబడులు, గృహ సంబంధ ఆదాయాల మీద చర్చలు ఆలోచనలుభూ సంబంధ విషయాల గురించి పెట్టుబడుల గురించి, ముందుకు సాగుతాయి. విందు వినోదాలులో పాల్గొనడం, ఉపాసన బలం పెంచుకోవడం.మానసిక ప్రశాంతత చాలా వరకు తక్కువగా ఉంటుంది. పాత ఆలోచనలు అదేపనిగా గుర్తుకు వస్తూమనసులోస్థిరత్వంతక్కువ.సృజనాత్మకత,సంఘంలోపలుకుబడికలిగినవ్యక్తులసహకారంతోపనులుసాధించుకుంటారు, ఇంతవరకు ఆగిన పనులు అవలీలగాముందుకు సాగుతాయి, ఆరోగ్యవిషయంలోశ్రద్ధఅవసరమురోగనిరోధకశక్తినిపెంచుకోవాలి, పాత రుణములను కొంతవరకు తీరుస్తారు. ,బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారంప్రారంభంలోస్వతంత్రంగాఆలోచనలుచేస్తారు.సంతానపరమైనవిషయాలలోసృజనాత్మకఅంశాలలోపెట్టుబడికిసంబంధించినఆలోచనలలో కొత్త నైపుణ్యాలను ప్రదర్శిస్తారు వ్రాత నైపుణ్యాలుపెరుగుతాయి.పట్టుదలగా అనుకున్న పనులు సాధిస్తారు. వృత్తిపరమైన అభివృద్ధి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయిధైర్య సాహసాలుపెరుగుతాయి. విద్యా వాహన గృహ సౌకర్యాలు అనుకూలంగా ఉంటాయి. విద్యార్థులు పోటీ పరీక్షలలో శ్రమతో విజయాన్ని సాధిస్తారు. గృహ వాహన సంబంధ అంశాల కొనుగోలు కొరకు లాభ పరమైన నిర్ణయాలు చేయడం జరుగుతుంది. వృత్తిపరంగా అభివృద్ధి, గౌరవం పెరుగుతుంది. నూతన గృహ సంబంధ వస్తువులకు కొనుగోలు కొరకు ఆలోచనలు చేస్తారు.ఉ భాగస్వామివిషయాలుఅనుకూలంగాఉంటాయి.


శ్రద్ధా శ్రీనాథ్